జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 3 సంచిక - 10 పక్షపత్రిక మే 16-31, 2012

## భారత పార్లమెంటుకు 60 ఏళ్ళు





కెపిహెచ్‌బి కాలనీ ప్రజాపథంలో డా॥ జేపీ



కూకట్‌పల్లి ప్రజాపథంలో డా॥ జేపీ



ఓల్డ్ బోయిన్‌పల్లి ప్రజాపథంలో డా॥ జేపీ



ఫతేనగర్ ప్రజాపథంలో డా॥ జేపీ

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక మే 16-31, 2012

సంపుటి - 3 సంచిక - 10

## లోపలి పేజీల్లో...

పార్లమెంట్ చరిత్ర.............................. 5

ధన రాజకీయంతో జన రాజకీయం ఎలా..7

తొలి పార్లమెంటేరియన్ల మనోభావాలు... 9

సభే సర్వోన్నతం.................................. 12

సాధించినది స్వల్పం ఏమీ కాదు........... 13

మేలైన చట్టాలు.. శిలాక్షర శాసనలు....... 15

జగనూ.. భక్త రామదాసు...................... 21

ఒక్క లక్ష్మణ్‌కే శిక్ష విధించే వివక్ష వ్యవస్థను సహిద్దామా? మార్చుకుందామా............. 22

ఎటువంటి టెక్నాలజీ కావాలి................ 25

వ్యవసాయ విముక్తికి సంస్కరణలు చేపట్టండి... 27

బెల్టుషాపులలో స్వాధీనం చేసుకున్న మద్యం.... 30

పత్రికా స్వేచ్ఛకు భంగం కాదు : జేపీ..........31

లోక్‌సత్తా పార్టీ కార్యక్రమాలు................ 32

## సంపాదకవర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

**సంపాదక వర్గం**

జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫొటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# 'కుమ్ముక్కు' రాజకీయాలు

## సంపాదకీయం

ఉప ఎన్నికల రగడ మొదలయ్యింది. ఇప్పటికే ప్రధాన పార్టీ నాయకులందరూ రాష్ట్రమంతా తిరుగుతున్నారు. ప్రతి ప్రసంగంలో ఎవరు ఎవరితో కుమ్ముక్కు అయ్యారో సోదాహరణంగా వివరిస్తున్నారు. ఎవరు ఎవరిని ఓడించడానికి పావులు కదుపుతున్నారో చెబుతున్నారు. ఈ ప్రచారాల్లో కులాలు, మతాలు, విశ్వాసాలు చివరకి రంగులు కూడా ప్రస్తావనకు వస్తున్నాయి.

కుమ్ముక్కు అనే మాట ఈ మధ్య బాగా పాపులర్ అయింది. అధికార పక్షం కాంగ్రెస్ సహా బిజెపి, తెలుగుదేశం, టీఆర్‌ఎస్, వైకాపా నేతలు కూడా ఈ మాట విస్తృతంగా వాడుతున్నారు. జగన్ చంద్రబాబుతో కుమ్ముక్కు అయ్యాడని ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి అంటే జగన్, టీఆర్‌ఎస్ కుమ్ముక్కు అయ్యారని చంద్రబాబు అంటున్నాడు. తనను ఓడించడానికే కాంగ్రెస్, తెలుగుదేశం కుమ్ముక్కు అయ్యాయని జగన్ అంటున్నాడు. జగన్, టీఆర్‌ఎస్ కుమ్ముక్కయ్యాయని బిజెపి అంటుంది. కుమ్ముక్కు అనే మాట వాడకపోయినా ఉభయ కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఒకరినొకరు దెప్పి పొడుచుకుంటున్నారు. రహస్య ఎజెండాల గురించి పత్రికలకెక్కారు. వీరిమధ్య ఖండన మండనలు, కాంప్రమేజ్‌ల పరంపర కొనసాగింది. ఎటొచ్చీ ఎవరు ఎవరితో కుమ్ముక్కు అయ్యారు అనే విషయం ప్రజలకు అర్థంకావడం లేదు. ఈ కాంబినేషన్లకు కూడా వావి వరుసలు వుండడం లేదు. ఇక తెలుగు వార్తాపత్రికల విషయానికి వస్తే ఒక్కో పత్రిక ఒక్కో పార్టీకి ప్రత్యక్షంగానో పరోక్షంగానో మద్దతిస్తుంది. వాటి రాతలు చూస్తే కూడా ఆ రాజకీయ పార్టీలతో అవి కుమ్ముక్కు ఎలా అయ్యాయో సామాన్య పాఠకుడికి కూడా అర్థం అవుతుంది. అందుకే ఏ ఒక్క పత్రిక రాతల్ని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరు. వాస్తవాలు ఎలా వున్నా భిన్న వాదనల్ని వినిపించే పత్రికలను మార్చి మార్చి చదువుతున్నారు.

తెలంగాణాలో పరకాల అసెంబ్లీకి ఉప ఎన్నిక జరుగుతుంది. ఇక్కడ అందరి ప్రచారం జై తెలంగాణే. నై తెలంగాణా అనేవారు ఒక్కరు కూడా లేరు. అన్ని పార్టీలు తమ జెండాలు వేరైనా అజెండా మాత్రం తెలంగాణ సాధనే అంటున్నాయి. అందరూ శాఖాహారులే ... అనే సామెతను ఈ పార్టీలు గుర్తు తెస్తున్నాయి. ఇక్కడ కూడా ఎవరు ఎవరితో కుమ్ముక్కు అయ్యారు అనే అంశమే చర్చకు వస్తుంది. ప్రజలు ఇదంతా గమనిస్తున్నారన్న స్పృహ పార్టీలకు వుండడం లేదు. నవ్విపోదురు గాక... నాకేటి సిగ్గు... అన్న కృష్ణశాస్త్రి కవితలాగా ఎవరెలా అనుకున్నా ఈ ఉప ఎన్నికల్లో గెలుపుతీరాన్ని దాటాలని అన్ని పార్టీలు ఉబలాటపడుతున్నాయి.

"సబ్ కా సున్‌నా అప్ నా కర్‌నా" అనే మాటను ఓటర్లు ఎప్పుడూ పాటిస్తుంటారు. ఎన్నికల ప్రచారంలో అన్ని పార్టీలు చెప్పే విషయాలను చెవులు రిక్కించి మరీ వింటారు. అంతిమంగా పార్టీల దిమ్మ తిరిగేలా గతంలో తీర్పులు కూడా ఇచ్చారు. అసలు సా.రా పార్టీలు ప్రజలకు వ్యతిరేకంగా కుమ్ముక్కై తమ పబ్బం గడుపుతున్నారని అర్థం అయితే ఓటరు మహాశయులకి మండేచోట మండితే మళ్ళీ మళ్ళీ ఈ పార్టీలకి బుద్ధి చెబుతారు. ◆




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
8-2-674బి/2/9, ప్లాట్ నం : 93
హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,
బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034

**ఫోన్ నంబర్లు :**
**040- 23311817, 23311819,**
**23311820, 23312829**
**ఫ్యాక్స్ : 040-23310612**
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# పార్లమెంట్ చరిత్ర

**పార్లమెంట్ అంటే... మాట్లాడడానికి, చర్చలు జరపడానికి నిర్వహించే కార్యక్రమం అని అర్థం. ఫ్రెంచ్ పదం పార్లర్ (Parler) దీనికి మూలం. పార్లమెంట్ అన్న పదాన్ని అధికారికంగా తొలుత ఉపయోగించింది 1236లో**

**పార్లమెంటరీ ప్రజాస్వామ్య ఆవిర్భావం.. సుదీర్ఘ ప్రయాణం. బ్రిటన్‌లో 12వ శతాబ్దం నుంచి సంభవించిన కొన్ని వేగవంతమైన, విప్లవాత్మకమైన పరిణామాలతో అక్కడ రూపుదాల్చి, స్థిరపడిన పార్లమెంటరీ వ్యవస్థను పలు వలస దేశాలు స్వీకరించాయి. చక్రవర్తులు తమ అధికారాన్ని కాపాడుకోవడానికి మొదలు పెట్టిన సమావేశాలే... వారి అధికారాలను తగ్గిస్తూ.. ఒక పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా రూపుదాల్చిన క్రమం ఆసక్తికరం.**

ప్రజలకు సమీపంగా, వారి జీవితాలకు కాస్త దగ్గరగా ఉంటూ గణనీయ ప్రభావం చూపగల జమీందార్లు, భూస్వాముల నుంచి తమ అధికారానికి సవాల్ రాకుండా చూసుకునేందుకు బ్రిటన్ చక్రవర్తులు వారితో అడపాదడపా భేటీ అయ్యే వారు. ఇలాంటి భేటీలనే పార్లమెంట్ అనేవారు. జమీందార్ల మాటలకు విలువ ఇస్తున్నట్లు అనిపించేలా చేసి సంతృప్తి పరిచేవారు. రాజుల ఈ బలహీనతను బాగా అర్థం చేసుకున్న జమీందార్లు, భూస్వాములు... తమ అవసరాలను తీర్చుకోవడానికి ఆ సమావేశాలను వేదికగా చేసుకుంటూ తమ మాట విలువ పెంచుకుంటూ వచ్చారు. పై చేయి సాధించారు. అనంతర కాలంలో ఈ భేటీలు తప్పని సరవడమే కాకుండా... గ్రామస్థాయుల ప్రతినిధులకూ సమావేశాల్లో అవకాశం ఇవ్వడం మొదలయింది. క్రమంగా ఈ భేటీలు ఒక సంస్థలా.. ఒక వ్యవస్థలా మారి రాజుల మాట కన్నా ప్రతినిధుల మాట పై చేయి సాధించింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఆవిర్భవించింది.

## పరిణామ క్రమమిదీ....

### మాగ్నాకార్టా

తమ ఆకాంక్షలకు వ్యతిరేకంగా పరిపాలన నడుస్తోందన్న కారణంతో కింగ్ జాన్‌కు వ్యతిరేకంగా బ్యారన్లు తిరుగుబాటు చేశారు. ఫలితంగా... వారి సూచనలు, సలహాలను రాజు తప్పనిసరిగా అనుసరించడానికి ఉద్దేశించిన 'మాగ్నాకార్టా' ఒప్పందం 1215లో అమల్లోకి వచ్చింది.



## ఆక్స్‌ఫర్డ్ షరతులు

1258 ఆక్స్‌ఫర్డ్‌లో జరిగిన పార్లమెంట్ సమావేశంలో బ్యారన్లు కొన్ని విప్లవాత్మక షరతులను ప్రతిపాదించి, అమలుకు పట్టుబట్టారు. ఈ రెండూ ముఖ్యమైనవి.

- ఏడాదికి మూడు సార్లు పార్లమెంట్‌ను క్రమం తప్పకుండా సమావేశపర్చాలి.
- కౌంటీ (మండలాలు) ల నుంచి కులీన వర్గాలు కాని వారు 12 మందిని ఈ సమావేశాలకు ఎంపిక చేయాలి.

ఇందుకు హెన్రీ-3 చక్రవర్తి అంగీకరించకపోవడంతో జమీందార్లకు, చక్రవర్తికి మధ్య 1264లో జరిగిన యుద్ధంలో విజయం సాధించిన జమీందార్ల నాయకుడు సైమన్ డి మాంట్‌ఫోర్ట్... 1265లో.. తన ఆలోచనలకు ప్రతిరూపమైన పార్లమెంట్‌ను ఏర్పాటు చేశాడు. అందులో కులీన వర్గాల వారే కాకుండా ప్రతి కౌంటీ నుంచి, నగరాల నుంచి, పట్టణాల నుంచి ప్రతినిధులకు అవకాశం కల్పించాడు. ఇది జరిగిన కొద్ది నెలలకే హెన్రీ-3 కుమారుడు ఎడ్వర్డ్1... డి మాంట్‌ఫోర్ట్‌ను యుద్ధంలో చంపేశాడు.

## పన్నులకు పార్లమెంట్ ఆమోదం

1272లో ఎడ్వర్డ్1 చక్రవర్తి అయ్యాడు. యుద్ధాలకు అవసరమైన సొమ్ము చాలక ఎడ్వర్డ్-, అతని వారసులు ప్రజలపై పన్నులు వేసేవారు. అందుకు వ్యతిరేకత రాకుండా ఉండేందుకు.. పార్లమెంట్‌ను సమావేశపరిచి, ప్రతినిధుల ఆమోదం పొందేవాడు. 1278 నుంచి పార్లమెంట్ సమావేశాల వివరాలను రాతపూర్వకంగా నమోదు చేసి భద్రపరిచేవారు. ప్రతి కౌంట్ నుంచి ఇద్దరు. ప్రతి పట్టణం నుంచి ఇద్దరు ప్రతినిధులను ఎన్నికల ద్వారా నియమించడం ఎడ్వర్డ్ 1 ఆదేశాలతోనే మొదలైంది.

## స్పీకర్ ఆవిర్భావం

1376లో చక్రవర్తి ఎడ్వర్డ్-3 ముందు ఫిర్యాదులు ఏకరవు పెట్టడానికి కామన్స్ సభ్యులు.. తమ ప్రతినిధిగా సర్ పీటర్ డె లా మారెను ఎంచుకున్నారు. కామన్స్ సభా వ్యవహారాలకు అధ్యక్షత వహించే ఒక ప్రతినిధిని ఎన్నుకోవడం అప్పటి నుంచే మొదలయింది. స్పీకర్ అన్న భావనకు ఆ పరిణామమే మూలం.

## కామన్స్ ప్రాభవం

1376 తర్వాత క్రమంగా కామన్స్ ప్రాభవం పెరుగుతూ వచ్చింది. తొలుత చట్టాల రూపకల్పన అధికారం ఎగువసభకే.. అంటే లార్డ్స్‌కే ఉండేది. 1407 తర్వాత పరిస్థితి మారింది. కామన్స్ సభలోనే ముసాయిదా చట్టాలను రూపొందించి ఎగువసభకు సమర్పించేవారు. వీటినే బిల్లులు అనేవారు. 1414లో ముఖ్యమైన పరిణామం చోటు చేసుకుంది. తాము రూపొందించిన బిల్లుల్లో పదజాలాన్ని తమ ఆమోదం లేకుండా మార్చరాదని, తమ ఆమోదం లేకుండా ఏ బిల్లూ చట్టరూపం దాల్చరాదని రాజు హెన్రీ-5ను కామన్స్ గట్టిగా ఒప్పించారు.

## అధికారాల విస్తరణ

1530ల నాటికి పార్లమెంట్ మరిన్ని అధికారాలను కైవసం చేసుకుంది. దేశాన్ని ప్రభావితం చేసే అన్ని అంశాల్లోనూ చట్టాలు చేయడం ప్రారంభించింది. గతంలో కేవలం చర్చికి మాత్రమే అధికారం ఉన్న మతపరమైన అంశాల్లోనూ అంటూ లేకుండా విస్తరించింది. అప్పటి నుంచి పార్లమెంటరీ వ్యవస్థ బాగా స్థిరపడింది.

## కొనసాగిన ఆధిపత్యపోరు

రాజుల అధికారాలను క్రమంగా పార్లమెంట్ తగ్గిస్తూ వచ్చినా రాజులూ తమ పంతాలను వీడలేదు. తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తూ వచ్చారు. 1625లో ఛార్లెస్-1 అధికారంలోకి వచ్చాక పార్లమెంట్‌ను ఖాతరు చేయలేదు. నియంతృత్వాన్ని ప్రదర్శించాడు. బలవంతంగా పన్నుల వసూళ్లకు పాల్పడ్డారు. చెల్లించడానికి నిరాకరించిన పలువురిని జైలులో బంధించాడు. ఫలితంగా అంతర్యుద్ధం తారస్థాయికి చేరి అతన్ని విచారించి, మరణదండన విధించే వరకు పరిస్థితి వెళ్లింది. ఆ తర్వాత రాజులు తమ ఆధిపత్యాన్ని చాటుకోవడానికి ప్రయత్నించినా పార్లమెంట్ ఆధిపత్యమే నిలబడింది. 1801లో మరో పెద్దపరిణామం. గ్రేట్ బ్రిటిన్, ఐర్లండ్ రాజ్యాలు కలిసి పోయి యూకే పార్లమెంట్ ఏర్పడింది. ◆

**1858లో భారత్‌లో ఈస్టిండియా కంపెనీ పరిపాలనను రద్దు చేసి సరాసరి యూకే పార్లమెంట్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఈ విధంగా క్రమంగా భారత్‌లోనూ పార్లమెంటరీ వ్యవస్థ ఆవిర్భవించింది.**

# ధన రాజకీయంతో...జన రాజకీయం ఎలా..? - జేపీ

డబ్బుల్ని, ఓట్ల కొనుగోలునే రాజకీయానికి ప్రాతిపదికలు చేసుకున్నాక... పార్లమెంటులో ప్రమాణాలు లేవని, మంచి వాళ్లు రావటం లేదు, నేరస్తులు, అవినీతిపరులు ఎన్నికవుతున్నారని వాపోవటం అవివేకమని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. చట్టసభ అనేది కేవలం ప్రభుత్వం ఏర్పాటుకి, అధికారం చెలాయించటానికి, సంఖ్యాబలానికి వేదికగా మాత్రమే మిగిలిపోయే వ్యవస్థను నిర్మాణం చేసుకున్నాక పార్లమెంటులో అనివార్యంగా ప్రమాణాలు దిగజారతాయన్నారు. **మే 13, 2012న భారత పార్లమెంటు వజ్రోత్సవం సందర్భంగా జయప్రకాష్ నారాయణ్ ప్రజలకు శుభాకాంక్షలను తెలియచేస్తూ...** "తొలినాటి పార్లమెంటులో స్వాతంత్ర్య సమరయోధులు, విద్యతో పాటు విద్వత్తు, వినయం ఉట్టిపడేవారు పాలుపంచుకున్నారు. అటువంటివారిని తిరిగి చట్టసభలలోకి ఎలా తీసుకురావాలో మనందరం సమీక్షించుకోవాల్సిన విశిష్ట సందర్భం ఇది" అన్నారు.

"1952లో తొలినాటి పార్లమెంటులో పాల్గొన్నవారిలో అత్యధికులు దేశనిర్మాణం, జాతి నిర్మాణం చేసినవారు. రాజ్యాంగ నిర్మాతలు, రాజ్యాంగం కింద ఏర్పడిన వ్యవస్థల్ని, సంస్థల్ని నిర్మాణం చేసినవారు. కాబట్టే ఆ స్పృహతో అభిప్రాయభేదాల్ని అధిగమించి ఆరోగ్యకరమైన చర్చకు వారంతా పునాదివేశారు. ఈవేళ ఎందుకలా జరగటంలేదంటే అలాంటివారు ఎన్నికకావటం దాదాపు అసాధ్యంగా మారింది. మీరు ఒక్క అసెంబ్లీ ఉప ఎన్నికకు రెండు, మూడు పార్టీలు కలిపి రూ. 30 కోట్లు ఖర్చుపెడుతుంటే ఇక నిజాయతీపరులు ఎలా ఎన్నికవుతారు?" అని జేపీ అన్నారు.

అలాగే తొలితరంలో గొప్పనాయకులు అధికారంలోకి వచ్చినప్పుడు మన వ్యవస్థలో వున్న మౌలికమైన లోపాలను సరిచేసేందుకు గట్టి ప్రయత్నం జరగలేదని జేపీ అన్నారు.

"ఉదాహరణకు అధికారాన్ని పూర్తిగా కేంద్రీకరించారు. అసలు మన ఊళ్లో, మన మునిసిపాలిటీలో, మన వార్డులో ఏ పనీ జరగని పరిస్థితి నెలకొంది. ప్రతి చిన్నపనికీ... ఒక జనన ధ్రువపత్రం కావాలన్నా, ఒక రేషన్ కార్డు కావాలన్నా, పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నా సిఫార్సో, లంచమో అవసరమైన పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతోంది. ఓటు ఎందుకో, ఏమిటో తెలియక, ఏదో ఓటువేస్తున్నాం, ఎవరో వస్తున్నారు పదవుల్లోకి అని తప్ప ఇంకేమీ తెలియని పరిస్థితులలో ప్రజలు ఉన్నారు. ప్రతి చిన్నపనికీ ఎన్నికైన వాళ్ల మీద ఆధారపడటం, ఓటు వేశాం కాబట్టి వాళ్లే చేస్తారనుకోవటం, ఎన్నికైనవాళ్లు ఎంతక కష్టపడినా వందలో పదో, ఇరవయ్యో తప్ప చేయలేకపోవటం ఒక గందరగోళ వలయంలా సాగుతోంది. ఎన్నికైనవాళ్లకి జీవితంలో సొంతంగా ఆదాయానికి మార్గం, కుటుంబానికి సమయం ఇచ్చే పరిస్థితి లేకపోవటం వల్ల వాళ్లు ఊపిరాడనంత ఒత్తిడికి గురవుతున్నారు. దీంతో నిజాయతీపరులంతా నిరుత్సాహ పడిపోయి, నిజాయతీగా రాజకీయాలలో ఉండటం అసాధ్యమని బైటికి పోతున్నారు. ఈ పరిస్థితిని అడ్డంపెట్టుకుని నాయకుల కొడుకులు, కూతుళ్లు లేదా రాజకీయాల్ని వ్యాపారంగా భావించి పదవుల ఆశిస్తున్నవారు మాత్రమే రాజకీయాలలోకి వస్తున్నారు, కొనసాగుతున్నారు. వ్యాపారం కోసం వచ్చారు కాబట్టి వాళ్లు వ్యాపారంగానే రాజకీయం చేస్తున్నారు. అంతా బేరసారాలే సాగిస్తుంటారు. వాళు చట్టసభలలో కూర్చునేది తమకు కాంట్రాక్టులు, భూముల కేటాయింపులు, టెండర్లు, మైనింగ్ కేటాయింపులు, మంత్రిపదవులు వంటి వాటి కోసమే. మంత్రి పదవులు వచ్చాక అధికారాన్ని దుర్వినియోగం చేస్తుంటారు. ఇవి తప్ప ఆరోగ్యకరమైన చర్చ, మంచి చట్టాలు, విధివిధానాలు, ప్రజల

**రాజ్యాంగ రచన దాదాపు పూర్తి అయిన సందర్భంలో 1949 నవంబరు 25న రాజ్యాంగ నిర్ణాయక సభలో డాక్టర్ అంబేద్కర్ అన్న మాటలివి. 'ప్రజాస్వామ్య స్ఫూర్తిని పరిరక్షించుకోవాలంటే మనం ఏం చేయాలి? సామాజిక, ఆర్థిక లక్ష్యాల సాధనకోసం రాజ్యాంగబద్ధమైన పద్ధతులకు గట్టిగా కట్టుబడి ఉండాలి. శాసనోల్లంఘన, సహాయ నిరాకరణ లాంటి పద్ధతులకు స్వస్తి చెప్పాలి. వీటిని ఎంత త్వరగా వదులుకుంటే అంత మంచిది' అన్నారాయన. పార్లమెంటు బయట ఉండాల్సిన ప్రవర్తన గురించి అంబేద్కర్ చేసిన హెచ్చరిక ఇది.**

అభివృద్ధి అన్న అవగాహనే వారికి ఉండదు" అని జేపీ పేర్కొన్నారు.

ఒక చెడు నుంచి మరో చెడుకు అనివార్యంగా సాగుతున్న ఈ పరిస్థితిని ఈవేళ మార్చాలి అంటే ఊరికే తిడుతూ కూర్చుంటే లాభం లేదని, అవినీతి డబ్బు చుట్టూ తిరుగుతున్న ఎన్నికల, పాలనావ్యవస్థలను సమూలంగా ప్రక్షాళన చేసే మార్పుల్ని తీసుకురావాలని జేపీ అన్నారు. నిరాశానిస్పృహలకు లోనవ్వాల్సిన పన్లేదన్నారు.

**'ఎన్నికల వ్యవస్థను మార్చుకోవటం, అధికారాన్ని జనం చేతిలో పెట్టటం,**

**సిటిజన్ ఛార్టర్లను ఏర్పాటు చేయటం' కోసం ఇప్పటికైనా కదలాలి**

"మనం పూర్తిగా నిరాశ చెందాల్సిన పన్లేదు. భారత పార్లమెంటులో ప్రమాణాలు ఆందోళనకరంగా దిగజారుతున్నా కూడా కొంతమేరకు ఆరోగ్యకరమైన చర్చే జరుగుతోంది. తాజాగా, 2012-13 కేంద్ర బడ్జెట్ ఆమోదం సమయంలో ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీ, ప్రతిపక్ష పార్టీకి చెందిన యశ్వంత్ సిన్హా గొప్ప ప్రసంగాలు చేశారు. విమర్శలను పరస్పర గౌరవంతో తిప్పికొట్టారు. దేశభక్తి ఉట్టిపడే రీతిలో మౌలికమైన అంశాలను స్పృశించగలిగారు. పార్లమెంటుకున్న ఆ స్థాయిని కాపాడుకుంటూ ఇంకా పెంపొందించుకోవాలంటే ఓట్ల కొనుగోలు ఎన్నికల వ్యవస్థను, రాజకీయాన్ని మార్చాలి. ఒక్క ఓటు తేడాతో గెలవటం, ఓడిపోవటం అనే ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ వల్లే విచ్చలవిడిగా ఓట్ల కొనుగోలు చేయటం, అవినీతిపరులకు, నేరచరితులకు, కులం తప్ప ఇంకేమీ లేనివారికి టికెట్లివ్వటం జరుగుతోంది. ఈ ఎన్నికల పద్ధతిని మార్చి, ఓట్ల శాతాన్ని బట్టి సీట్లు వచ్చే దామాషా ఎన్నికల పద్ధతిని తీసుకురావటం, అధికారాన్ని వికేంద్రీకరించి ఏఊరికి ఆ ఊరులో జనం చేతిలో పెట్టి బాధ్యతను ఇవ్వటం వల్ల నాయకత్వం ఎదుగుతుంది. దాంతోపాటు నిర్దిష్ట కాలపరిమితిలో ప్రభుత్వసేవల్ని అందించకపోతే పరిహారం చెల్లించేలా సిటిజన్ ఛార్టర్లను ఏర్పాటు చేస్తే అవినీతి, వేధింపులు తగ్గి ప్రజలకు సులభంగా రోజువారీ పనులు పూర్తయ్యే వ్యవస్థ ఏర్పడుతుంది" అన్నారు.

"ఎన్నికల వ్యవస్థలో మార్పు, అధికారాన్ని జనం చేతిలో పెట్టటం, సిటిజన్ ఛార్టర్లను ఏర్పాటు చేయటం చేస్తే... ఒడ్డున కూర్చుని గడ్డలేస్తున్న సమర్థులు రాజకీయాలలోకి వచ్చి పాలనలో, రాజకీయాలలో తమ సామర్థ్యాన్ని చూపగలుగుతారు. క్రియాశీలక ప్రజాస్వామ్యానికి, దార్శనికతకు సంకేతంగా నిలిచిన 1952 కాలంనాటి పార్లమెంటును మళ్లీ చూడగలుగుతాం. ఈవేళ కూడా మన సమాజంలో అన్ని రంగాలలో, అన్ని పార్టీలలో, అన్ని ప్రాంతాలలో, అన్ని రాష్ట్రాలలో గొప్పవ్యక్తులు ఉన్నారు. వాళ్లను రాజకీయాలలోకి వచ్చేలా ప్రేరేపించి తద్వారా సమాజం మంచిని పొందటం ఎలా అనే దాని మీదే మనం దృష్టిని కేంద్రీకరించాలి. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య వజ్రోత్సవం అందుకు సరైన సమయం" అని జయప్రకాష్ నారాయణ్ విడుదల చేసిన శుభాకాంక్ష సందేశంలో అన్నారు. ◆



## ప్రజలు నిజాయతీగా ఓటు వేస్తే వచ్చే ఎన్నికల నుంచే మార్పు వస్తుంది

"రాజకీయాలలో డబ్బు ప్రభావం అధికమైంది. స్వాతంత్ర్యం సాధించిన రోజులలో నేతల్లో డబ్బు సంపాదించాలనే ఆసక్తి ఉండేది కాదు. దేశ సమస్యలపైనే దృష్టి కేంద్రీకరించేవారు. దేశం బాగుపడాలంటే ముందు గ్రామాలు సుభిక్షమవ్వాలి. విద్యాసౌకర్యాలు కల్పించాలి. గ్రామాలలో ఇప్పటికీ సరైన విద్య అందటం లేదు. ఉపాధ్యాయులు సరిగా పాఠశాలలకు హాజరుకావటం లేదు. నేతలు ఈ పరిస్థితులలో మార్పు తీసుకురావాలి. మద్యం వల్ల గ్రామాలు ధ్వంసం అయిపోతున్నాయి. అవినీతినిర్మూలనకు లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్, అన్నాహజారే పోరాటం చేస్తున్నారు. అవినీతిని అంతం చేయాలంటే అవినీతిపరుల ఆస్తుల్ని జప్తుచేయాలని, ఎంతటివారినైనా జైలుకు పంపాలని, పదవుల నుంచి తొలగించాలని లోక్‌సత్తా జేపీ ఎప్పటినుంచో గట్టిగా చెబుతున్నాడు. అలా జరగాలి. ప్రతి ఒక్కరూ లంచాలు తీసుకోము, ఇవ్వము అని ప్రతిజ్ఞచేసి అమలు చేయాలి. తమ ఓట్లను డబ్బుకు తాకట్టుపెట్టకుండా ప్రజలు నిజాయతీగా ఓటు వేస్తే 2014 ఎన్నికల నుంచైనా మార్పు తప్పనిసరిగా వస్తుంది. ఎన్నికల్లో నిలబడటానికి డబ్బులు విపరీతంగా ఖర్చుచేస్తున్నారు. అందుకు దోచుకున్న, దాచుకున్న సొమ్మును పెట్టుబడిగా పెట్టి, మళ్లీ సంపాదించుకుంటున్నారు. విదేశానికి చెందిన మదర్ థెరిస్సా... తన జీవితాన్ని త్యాగం చేసి మనదేశ ప్రజలకు సేవలందించారు. అదే స్ఫూర్తితో మన ప్రజాప్రతినిధులు కూడా పనిచేయాలి. పార్టీ రహిత సమాజం రావాలి".

**-భారత పార్లమెంటువజ్రోత్సవం (మే 13, 2012) సందర్భంగా తొలి లోక్‌సభ (1952) ఎంపీ కందాళ సుబ్రహ్మణ్య తిలక్**



# తొలి పార్లమెంటేరియన్ల మనోభావాలు

- నేటి సభ్యుల్లో ఆ చిత్తశుద్ధి ఏదీ!
- కాలినడకనే సమావేశాలకు హాజరు
- శాంతి భద్రతలపై నెహ్రూను నిలదీశా

తొలి రోజుల్లో పార్లమెంటు సమావేశాలు ఎంతో హుందాగా సాగేవని, సభ్యులు ప్రజా సమస్యలపై నిస్వార్థంతో చర్చించేవారని... ఇప్పటి సభ్యుల్లో ఆ చిత్తశుద్ధి కరవైందని తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవు మండలం పటవల గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి పార్లమెంటు సభ్యుడు కానేటి మోహనరావు పేర్కొన్నారు. ఆయన పార్లమెంటులోని సెంట్రల్ హాల్‌లో కాసేపు గడిపారు. అక్కడే కానేటి విలేకరులతో మాట్లాడుతూ గత స్మృతులను నెమరు వేసుకున్నారు.

### వాకౌటే... ప్రధాన నిరసన

పార్లమెంటులో తొలి రోజుల్లో 90 శాతం మంది స్వాతంత్ర్య సమరయోధులే ఉండేవారు. నేను కమ్యూనిస్టు పార్టీ నేతను. అప్పట్లో సమావేశాలు చాలా హుందాగా సాగేవి. ప్రతిపక్షం, అధికారపక్షాలు ఒకరినొకరు గౌరవించుకొనేవి. ప్రజా సమస్యల చర్చలో చౌకబారు ఆరోపణలు చేసేవాళ్లం కాదు. పూర్తి ఆధారాలతోనే చర్చించేవాళ్లం. మేం పెట్టే ప్రతిపాదనలను ప్రభుత్వం వ్యతిరేకిస్తే సభ నుంచి వాకౌట్ చేయడమే అతి పెద్ద నిరసన. ప్రశ్నోత్తరాలు కూడా సక్రమంగా సాగేవి. పాలకుల నుంచీ తగిన సమాధానాలు వచ్చేవి. అప్పట్లో సభ్యులు ప్రతి అంశం మీదా ఎంతగానో అధ్యయనం చేసేవారు. ఇప్పటి సభ్యుల్లో అది కొరవడిందనేది నా అభిప్రాయం. ప్రజల సమస్యలను కూడా పట్టించుకోవడంలేదు. డబ్బులు తీసుకొని ఓట్లు వేస్తున్నందున ప్రజలపై వారికి సదుద్దేశం ఉండడం లేదేమో!

## నాటి సభా మర్యాదలే వేరు

### విలువలు దిగజారుతున్నాయి

పార్లమెంటుకు అప్పట్లో ఉన్నంత గౌరవం ఇప్పుడు లేదు. కేవలం కమ్యూనిస్టు సభ్యులే కొద్దోగొప్పో పార్లమెంటు గౌరవాన్ని కాపాడుతున్నారు. ఆనాటి సభ్యుల్లో అందరికంటే చిన్నవాడిని నేనే. రాజమండ్రి నుంచి దుర్గాబాయి దేశ్‌ముఖ్ వంటి మహామహులను ఓడించి... కేవలం 25 ఏళ్లకే ఎంపీగా ఎన్నికయ్యాను. ఆ అవకాశం కల్పించిన ప్రజలను ఇప్పటికీ మరిచిపోలేను. అందుకే వారి సమస్యలు తెలుసుకోవడమే కాదు.. పరిష్కరించేవాళ్లం కూడా. ప్రజలతో ఎప్పుడూ మాకు అవినాభావ సంబంధం ఉండేది. సభలో చర్చ ఎంత తీవ్రంగా ఉన్నా... శాంతియుతంగానే ముందుకు వెళ్లేవాళ్లం.

### కాలినడకన పార్లమెంటుకు

అప్పట్లో సామాన్య మానవుడు ఢిల్లీలో అడుగుపెట్టే పరిస్థితి ఉండేది కాదు. ఆ పరిస్థితులను మేమే మార్చాం. అప్పట్లో మాకు కేటాయించిన క్వార్టర్ల నుంచి చంకలో ఫైళ్లు పెట్టుకొని కాలినడక పార్లమెంటుకు చేరే వాళ్లం. మరో సగం మంది సైకిళ్లపై వచ్చేవారు. మార్గమధ్యలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ప్రజలు, రైతుల సమస్యలను వినేవాళ్లం. పార్లమెంటు సమీపంలో అప్పట్లో బస్సులు కూడా తిరుగుతుండేవి. ఇప్పటి పరిస్థితి చూస్తుంటే ఆశ్చర్యమేస్తోంది. కట్టుదిట్టమైన భద్రత, ఎర్రబుగ్గ వాహనాలు, వ్యక్తిగత భద్రతా సిబ్బంది.. ఇలా చాలా మార్పులు వచ్చాయి.

### చంపాలని చూశారు

నా జీవితంలో పదేళ్ల జైలు జీవితం గడిపాను. కొన్నాళ్లు బ్రిటీష్ వాళ్లు, స్వాతంత్ర్యం వచ్చాక కాంగ్రెసోళ్లు... ఇద్దరూ

నన్ను జైల్లో పెట్టినవారే. బ్రిటీష్ వాళ్లు నన్ను ఉరితీయడానికి చూస్తే.. కాంగ్రెసోళ్లు కాల్చిచంపాలని చూశారు. ఆ రోజుల్లో ప్రజల బలం ఉంది కాబట్టి ఇప్పుడు ఇలా మీ ముందున్నా. తెలంగాణలో నాలుగువేలమంది కమ్యూనిస్టులను కాంగ్రెస్ పాలకులు కాల్చేశారు. యానాంలో 400 మందిని కాల్చేశారు. యానాంలో నన్ను అరెస్టు చేసి జైల్లో పెట్టారు. నిన్ను ఇంకా కాల్చలేదా? అని అప్పటి సీఎం అడిగేవారు. జంతువును కట్టినట్లుగా కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసేవారు. రెండు హత్య కేసులు కూడా పెట్టారు. హైకోర్టు నిర్దోషిగా గుర్తించి విడుదల చేసింది.

## రూ.3 వేలతో ఎంపీగా పోటీ

మాది పెద్ద జమిందారీ కుటుంబం. మా తాత గాంధీగారి ప్రియశిష్యుడు మా తాత ఖజానా నుంచి వచ్చిన సొమ్ముతోనే బతికేవాళ్లం. 12వ సంవత్సరంలోనే రాజకీయాల్లోకి ప్రవేశించి.. భగత్‌సింగ్ అనుచరుడిగా ఉండేవాణ్ని. అప్పట్లో ఎంపీ ఎన్నికల కోసం నేను కేవలం రూ॥3 వేలు ఖర్చుపెట్టా. అయితే, రూ॥30 వేల అప్పుతో పార్లమెంటును వదిలా.

## 'నా సోదరిపైనే అత్యాచారం చేశారు'

పార్లమెంటు ఏర్పాటైన తొలి సభలోనే శాంతిభద్రతల పై చర్చ వచ్చింది. ఆ చర్చకు వేము సిద్ధమయ్యాం. సరోజినీనాయుడు కుమారుడు జైసూర్య ఉద్వేగంగా ప్రసంగిస్తున్నారు. ఇంతలో ప్రధాని నెహ్రూ కౌంటర్ చేస్తూ.. "మా ప్రభుత్వం అలా చేయదు" అని అన్నారు. దీంతో నాకు కోపం వచ్చి.. "నా సొంత చెల్లిపైనే మీ పోలిసులు అత్యాచారం చేశారు.'' అని నిలదీశాను. అంతే, సభంతా నిశబ్దం ఆవరించింది. తర్వాతి రోజు.. ఆ విషయాన్ని పత్రికల్లో పతాక శీర్షికల్లో ప్రచురించారు. పార్లమెంటు సభ్యులు ఎప్పుడూ... ప్రజల గురించి నిస్వార్థంగా త్యాగాలు చేయాలి. నిరాడంబరంగా ఉండాలి. ప్రజల వద్ద జమిందారులాగా ఉండకూడదనే నియమాన్ని పాటించేవాడిని.

## ఇక్కడకు రాకూడదనుకున్నా...

ఇక్కడి సన్మానానికి తొలుత రాకూడదనే అనుకున్నా అయితే అప్పట్లో నేను కూర్చున్న పార్లమెంటును మరోసారి చూడాలని ఆశ పుట్టింది. అందుకే వచ్చా. ఇక్కడ అంబేద్కర్, నేను ఒకే బల్లపై కూర్చునేవాళ్లం. తొలి పార్లమెంటులో సభ్యుడిని అయినందుకు గర్వంగా ఉంది స్పీకర్ మీరాకుమార్ చాలా తెలివిగా ఈ సన్మానాన్ని ఏర్పాటుచేశారు అనిపించింది. మాలాంటి అమాయకులను కూడా పిలిచి సన్మానించడం ద్వారా ఆమె నేటి సభ్యులను మమ్మల్ని చూసి నేర్చుకోండి అన్నట్లుగా ఓ సందేశాన్ని ఇచ్చారు. నాటి సుహృద్భావ వాతావరణాన్ని, పరిస్థితులను ఈనాటి సభ్యులు పునరుద్ధరిస్తారని ఆశిస్తున్నా. ◆

## డబ్బుకు దాసోహమంటే మార్పురాదు

" రాజకీయాల్లో ధన ప్రభావం అధికమైంది. స్వాతంత్ర్యం సాధించిన రోజుల్లో నేతల్లో డబ్బు సంపాదించాలనే ఆసక్తి ఉండేది కాదు. దేశ సమస్యలపై దృష్టి కేంద్రీకరించేవారు. దేశం బాగుపడాలంటే ముందు గ్రామాలు సుభిక్షమవ్వాలి. విద్యా సౌకర్యాలు కల్పించాలి. గ్రామాల్లో ఇప్పటికీ సరైన విద్య అందటం లేదు. ఉపాధ్యాయులు సరిగా పాఠశాలలకు హాజరుకావడం లేదు. నేతలు ఈ పరిస్థితుల్లో మార్పు తీసుకురావాలి. మద్యం వల్ల గ్రామాలు ధ్వంసమైపోతున్నాయి. ప్రతి ఒక్కరూ లంచాలు పుచ్చుకోం, ఇవ్వమూ అని ప్రతినబూని అమలు చేయాలి. తమ ఓట్లను డబ్బుకు తాకట్టుపెట్టకుండా ప్రజలు నిజాయితీగా ఓటేస్తే 2014 తర్వాతైనా మార్పు తప్పనిసరిగా వస్తుంది. ఎన్నికల్లో నిలబడానికి డబ్బులు ఖర్చవుతాయి. అందుకే దోచుకున్న, దాచుకున్న సొమ్మును పెట్టుబడిగా పెట్టి... మళ్లీ సంపాదించుకుంటున్నారు. విదేశానికి చెందిన మదర్ థెరిసా... తన జీవితాన్ని త్యాగం చేసి దేశ ప్రజల కోసం సేవలందించారు. అదే స్ఫూర్తితో మన ప్రజా ప్రతినిధులు కూడా పనిచేయాలి.

**– తొలి పార్లమెంటేరియన్ కందాళ సుబ్రహ్మణ్యం**

## జాతి నేతల అడుగుజాడల్లో నడవండి

"పార్లమెంటు సభ్యులు జాతీయ నాయకుల అడుగుజాడల్లో నడవాలి. తొలి లోక్‌సభకాలంలో అధికార, ప్రతిపక్ష సభ్యులు పరస్పరం గౌరవించుకునేవారు ఎవరూ వెల్‌లోకి దూసుకొచ్చేవారు కాదు. ఒకరిపై ఒకరు కేకలు వేసుకునేవారు కాదు. పార్లమెంటులో ప్రసంగాలు ప్రశాంతంగా సాగిపోయేవి. నిర్మాణాత్మకంగా ఉండేవి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు అత్యుత్తమ రోజులవి. నాడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, అబ్దుల్ కలాం ఆజాద్, జగ్జీవన్‌రాం లాంటి స్వాతంత్ర్య సమరయోధులతో కలిసి సభలో కూర్చోవడమన్నది గొప్ప అనుభూతి".

**– తొలి పార్లమెంటేరియన్ రిషాంగ్ కీషింగ్**

# దామాషా పద్ధతి ఎన్నికలే మేలు

## పార్లమెంట్ 60 ఏళ్ళ ప్రత్యేక సమావేశంలో అసదుద్దీన్ ఒవైసీ



చట్టసభల్లో ముస్లింలకు సరైన ప్రాతినిధ్యం లభించడం లేదని ఎంఐఎం నేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆవేదన వ్యక్తం చేశారు. మే 13న లోక్‌సభలో ఆయన ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. "ఇప్పటివరకూ ఎన్నికలు జరిగిన 15 లోక్‌సభల్లో జనాభా నిష్పత్తి ప్రకారం మైనార్టీలు 908 మంది ఎన్నిక కావాలి. కానీ, 471 మంది మాత్రమే ఎన్నికయ్యారు. ఇంకా 48 శాతం లోటు ఉంది. మైనార్టీ రక్షకులుగా చెప్పుకొనే పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన రోజు ఇది. ముస్లింలు సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడటానికి వారికి చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం లేకపోవటమే ప్రధాన కారణం. పార్లమెంటుపై మాకు అంతులేని విశ్వాసం ఉంది. కాని మాకు దక్కిందేమీలేదు. ప్రతి ఎన్నికల్లో ఈ వర్గానికి చెందిన 70-80 శాతం మంది ఓట్లేస్తున్నారు. వనరుల పంపిణీలో మాకు సమన్యాయం జరగటం లేదు. **నైష్పత్తిక ప్రజాప్రాతినిధ్యవిధానం అమలులోకి వస్తేనే ఈ దేశంలో బడుగు బలహీన, మైనార్టీలకు తగిన ప్రాతినిధ్యం లభిస్తుందనేది నా నమ్మకం.** ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల్లో 118 లోక్‌సభ స్థానాలుంటే కేవలం ఒకే ఒక మైనార్టీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు". అని అసదుద్దీన్ తెలిపారు.

గత 60 ఏళ్ళలో పార్లమెంటుపై ప్రజలకు గౌరవం ఉన్నా.. ఎంపీలు మాత్రం గౌరవ ప్రతిష్టలను కోల్పోయారని అసదుద్దీన్ అన్నారు. దీనికి కారణం సభ్యులు సమయానుకూలంగా స్పందించకపోవటమేనని తెలిపారు. **సామాన్యుడి గుండెలు మండించే సమస్యల గురించి సభలో మాట్లాడటం లేదన్నారు. ఇక్కడ మాట్లాడాల్సిన అంశాలపై టీవీ స్టూడియోల్లో చర్చిస్తూ సభా గౌరవాన్ని మంట కలుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.** గతంలో మధులిమాయే చెప్పిన సూత్రాలను ఈ సభ ఆమోదిస్తే సభాధ్యక్షస్థానం మరింత బలోపేతం అవుతుందని సూచించారు. సభాపతి రాజకీయాలకు అతీతంగా ఉండాలని రాజకీయపార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయాలని, తర్వాతి ఎన్నికల్లో పోటీచేసినప్పుడు ఆయనపై ఎవ్వరూ పోటీకి నిలవరాదని కూడా చెప్పారన్నారు. ప్రజాకాంక్షలకు స్పందించకుంటే ప్రజాస్వామ్యం హిపోక్రసీగా మారుతుందని అసదుద్దీన్ హెచ్చరించారు.

## పార్లమెంటు స్వతంత్రతను పరిరక్షించాలి



పార్లమెంటు స్వతంత్రత, సమగ్రతను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిరక్షించాలని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ పేర్కొన్నారు. ఈ వేదిక.. చట్టానికి, అధికారానికే కాక న్యాయానికి, దయకు చిహ్నంగా ఉండాలని ఉద్ఘాటించారు. స్వతంత్ర భారతదేశంలో పార్లమెంటు తొలిసారిగా సమావేశమై 60 ఏళ్లు పూర్తి సందర్భంగా జరిగిన ప్రత్యేక భేటీలో ఆమె పాల్గొన్నారు. సభ్యులు అత్యున్నత నైతిక ప్రమాణాలను అలవర్చుకోవాలని కోరారు. ''ఆమ్ ఆద్మీ... భారత ప్రజాస్వామ్యానికి గుండెగా మారాడు. గత 60 ఏళ్ళలో దేశం సాధించిన అత్యుత్తమ విజయం ఇదే" అని ఆమె పేర్కొన్నారు.

**ప్రజాస్వామ్యం గురించి నా భావన ఏమిటంటే.. "బలవంతుడికి ఉన్నన్ని అవకాశాలు బలహీనుడికీ ఉండాలి" అని మహాత్మాగాంధీ వ్యాఖ్యలను ఆమె ఉటంకించారు.**

## విమర్శలతో పరిష్కారం దొరకదు

## లోక్‌సభలో విపక్ష నేత సుష్మా స్వరాజ్



**"ప్రజాస్వామ్యంలో ఎదురయ్యే సమస్యలకు మరింత ప్రజాస్వామ్యమే పరిష్కారం.** ప్రజాస్వామ్య సంస్థల వల్ల ప్రయోజనాలు, లోపాలు ఉన్నాయి. వాటిపై విమర్శలు చేయడం ద్వారా పరిష్కారం లభించదు. చర్చల ద్వారానే పరిష్కారం కనుగొనాలి. అనేక సందర్భాల్లో, అనేక అంశాలపై సభలో గందరగోళం తలెత్తుతోంది. అయినా అంతర్గత బలం వల్ల సభ మళ్లీ పునరుత్థానం పొందుతోంది. 60 ఏళ్లుగా సామాజిక, రాజకీయ, ఆర్థిక అత్మపరిశీలన చేసుకుంటున్నాం. దీనివల్ల అనేకమంది రాజకీయాల్లోకి వస్తున్నారు. పార్లమెంటులో మహిళా ప్రాతినిధ్యం 10-11 శాతం మధ్యే ఉంటోంది. ప్రభుత్వాల మార్పు బుల్లెట్ ద్వారా కాక బ్యాలెట్ ద్వారానే జరుగుతుందని దేశం రుజువు చేసింది.

# సభే సర్వోన్నతం

- పార్లమెంటు గౌరవాన్ని పవిత్రతను కాపాడుకుందాం
- వజ్రోత్సవ సమావేశాల్లో ఉభయ సభల తీర్మానం
- సభల గౌరవ పునరుద్ధరణకు ఉమ్మడిగా కృషిచేద్దాం
- ఆత్మశోధనకు రాష్ట్రపతి, ప్రధానమంత్రి, స్పీకర్ పిలుపు

పార్లమెంటు వజ్రోత్సవాల సందర్భంగా ఉభయ సభలు ప్రత్యేకంగా సమావేశమై తమ వ్యవస్థ పూర్ణాధిపత్యాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశాయి. సర్వసత్తాక భారతదేశపు తొలి పార్లమెంటు సమావేశమై 60 ఏళ్లయిన సందర్భంగా లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్ చొరవతో ఈ ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఉభయ సభలూ... ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సమావేశమై వజ్రోత్సవ దినాన్ని ఆత్మశోధనకు కేటాయించాయి. సభలకు సగం మందే హాజరైనా దాదాపు మాట్లాడిన అందరు సభ్యులు తాము మారాల్సిన అవసరాన్ని చిత్తశుద్ధితో ప్రస్తావించారు. సాయంత్రం 5.30కు సెంట్రల్ హాల్లో రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని, లోక్‌సభ స్పీకర్‌లు మాట్లాడారు. 1952 నాటి తొలిసభకు ప్రాతినిధ్యం వహించిన నలుగురు పార్లమెంటేరియన్లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

### ఉభయ సభల సభ్యులు చేసిన తీర్మానాలివీ...

- పార్లమెంటు గౌరవం, ఔన్నత్యం, పవిత్రతను కాపాడతాం.
- ప్రజాస్వామ్య విలువలు, సిద్ధాంతాల్ని పటిష్ఠ పరచడానికి, మార్పునకు ఒక సమర్థవంతమైన వేదికగా పార్లమెంటును తీర్చిదిద్దుతాం.
- ప్రజల పట్ల ప్రభుత్వ జవాబుదారీ తనాన్ని పార్లమెంటు ద్వారా పెంపొందిస్తాం.
- జాతి నిర్మాణమనే పవిత్ర లక్ష్యానికి పునరంకితమవుతాం.



**ప్రతిభాపటేల్ (రాష్ట్రపతి)**

ఆరోగ్యవంతమైన, చైతన్యపూరిత ప్రజాస్వామ్యం దిశగా అడుగు లేయడం దిశగా అడుగులేయడం ప్రజా స్వామ్యం ముందున్న అతి పెద్ద సవాలు. కాబట్టి కృతనిశ్చయంతో జాగ్రత్తగా అడుగులేయాలి.

**హమీద్ అన్సారీ (ఉప రాష్ట్రపతి)**



''పార్లమెంటు పనిదినాలు తగ్గిపోతున్నాయి. సభల కార్యకలాపాలకు సంబంధించి లోగడ అనుసరించిన విధానాలు మళ్లీ రావాల్సి ఉంది. సరైన చర్చలు జరక్కుండానే చాలా బిల్లులు చట్టాలైపోతున్నాయి.



**మన్‌మోహన్ సింగ్ (ప్రధానమంత్రి)**

విలువలను గౌరవించేలా మన నడవడిక ఉండాలి. మనల్ని ఇక్కడకు పంపించిన వారి ప్రయోజనాలను, అభిప్రాయా లను ప్రతి ధ్వనించడమే కాదు... ఆ పనిని హుందాగా చేయాలి.

**మీరాకుమార్ (పార్లమెంట్ స్పీకర్)**



పార్లమెంటు సభ్యులు ఆత్మ పరిశీలన చేసుకునేందుకు ఇదే సరైన సమయం. చట్ట సభ సభ్యులు తప్పనిసరిగా ప్రజా ప్రయోజనాలకు రక్షణ కల్పించాల్సిందే.



**అద్వానీ (బి.జె.పి.)**

నిరక్షరాస్యులతో కూడిన భారత్ ఒక ప్రజాస్వామ్య దేశంగా మనుగడ సాగించగలదా? అంటూ పశ్చిమ దేశాల మేధావులు వెలిబుచ్చిన అనుమానాలన్నీ పటాపంచ లయ్యాయి.

# సాధించింది స్వల్పమేమీ కాదు!

***పదహారేళ్లు శాసనసభలో, 28 ఏళ్లు పార్లమెంటులో... వెరసి 44 ఏళ్ల చట్టసభల అనుభవం కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి సొంతం. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎంపికై వాజ్‌పేయి, ఇంద్రజిత్ గుప్తాల సరసన నిలిచిన ఉద్దండుడు. ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు....***

భారత పార్లమెంటు కాలపరీక్షకు నిలబడింది. విభిన్న వర్గాల వేదికగా నిలిచి మనమంతా ఒక దేశం అనే భావన కలిగించింది. అన్ని సిద్ధాంతాల అతివాదుల నుంచి మితవాదుల వరకు వివిధ సిద్ధాంతాల పార్టీలను, ఎంపీలను దశాబ్దాల పాటు ఒక సూత్రంలో ఉంచింది. బ్రిటన్ దిగువసభ (హౌస్ ఆఫ్ కామన్స్) వందల ఏళ్ల తర్వాత ఈ స్థాయికి ఎదిగి ఎడ్మండ్ బర్కే, గ్లాడ్‌స్టోన్, బెంజమిన్ డిసరెల్లీ, విన్‌స్టన్ చర్చిల్, ఎ.బీవన్ లాంటి గొప్పగొప్ప పార్లమెంటేరియన్లను అందించింది. ప్రపంచ పార్లమెంటులన్నింటికీ బ్రిటన్ పార్లమెంటే మాతృక. కాల పరీక్షకు నిలబడింది. చివరిసారిగా 17వ శతాబ్దంలో హింసాత్మక మార్పులు వచ్చాయి. ఆ తర్వాత ఏ కుదుపులూ లేవు. అయితే, ఆ స్థిరత్వానికి నాలుగు వందల ఏళ్లు పట్టింది. 19వ శతాబ్దం వరకు బ్రిటన్‌లో పురుషుల్లోనే అందరికీ ఓటు హక్కులేదు. ఆమెరికా, బ్రిటన్‌లలో 1920 తర్వాతే మహిళలకు ఓటు హక్కు వచ్చింది.

భారత్ విషయానికి వస్తే 1952లోనే నేరుగా అందరికీ ఓటు హక్కు ఇచ్చాం. అయినా, భారత్ పార్లమెంటు నాణ్యత ఆరంభంలోనే అద్భుతంగా ఉంది. రాజ్యాంగ పరిషత్తు చర్చలు చదివితే మన రాజ్యాంగ నిర్మాతలైన రాజేంద్రప్రసాద్, అంబేద్కర్, నెహ్రూ, మున్షీ, బి.ఎన్.రావు తదితరులు ఎంతటి పరిపక్వతను ప్రదర్శించారో అర్థం అవుతుంది. బ్రిటన్, అమెరికా పార్లమెంటుల్లో మాట్లాడే భాష ఆంగ్లం ఒక్కటే. భారత్‌లో అనేకం. ఇలాంటి భిన్నభాషల వేదికగా పార్లమెంటును నడపడం భారత్‌కే సాధ్యం. మొదటి రెండు దశాబ్దాలు సభ పూర్తిగా ప్రజల ప్రధాని నెహ్రూ ప్రభావంలో నడిచింది. విపక్షంలో ఉన్న ఆచార్య కృపలానీ, జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ నెహ్రూకు తీసిపోనివారే. వామపక్షాలకు పార్లమెంటరీ వ్యవస్థపై పెద్దగా నమ్మకం లేదు. వారి నుంచీ భూపేష్ గుప్తా, ఆక్స్‌ఫర్డ్‌లో ఆచార్యుడిగా పనిచేసిన హిరేన్ ముఖర్జీ లాంటి గొప్పగొప్ప పార్లమెంటేరియన్లు వచ్చారు. సోషలిస్టు రాంమనోహర్ లోహియా కొద్దికాలమే ఉన్నా సభకు వన్నె తెచ్చారు. మరో సోషలిస్ట్ నేత, ప్రముఖ న్యాయవాది నాథ్‌పాయ్ ప్రసంగం ఉందంటే నెహ్రూ ఎక్కడున్నా సభలోకి పరుగున వచ్చేవారు. నాథ్‌పాయ్ వయస్సులో చిన్నవాడైనా నెహ్రూ ఆయనకు కృపలానీతో సమానంగా గౌరవం ఇచ్చేవారు.



హిందూత్వ జాతీయ వాదుల్లో వాజ్‌పేయి 1957లో ఎన్నికైనప్పటి నుంచే గొప్పవక్త. బహిరంగ సభల్లో సాధారణంగా ప్రజల్ని అలరించే వక్తలు చట్టసభల్లో మేధావులను ఒప్పించలేరు. అదివాజ్‌పేయికి వర్తించదు. సీపీఐకి చెందిన ఇంద్రజీత్ గుప్తా ఒక ఆదర్శ పార్లమెంటేరియన్. సీపీఎం సంస్కృతిలో జ్యోతిబసూ ఎన్నదగ్గ వారే. మధూ దండావతే పరీక్షకు సిద్ధమయ్యే విద్యార్థిలా శ్రద్ధగా నోట్స్ రాసుకుని సభకు వచ్చేవారు. హిందీ, ఆంగ్లభాషల్లో అలవోకగా ప్రసంగించే ఆయన ఎక్కువ సమయాన్ని గ్రంథాలయంలో గడిపే వారు. నియోజకవర్గానికి వెళ్తున్నా మరో రెండు రోజుల్లో సభలో లేవనెత్తాల్సిన అంశాల మీదే దృష్టి, సోమ్‌నాథ్ ఛటర్జీ, ఇంద్రజీత్ గుప్తాలూ గ్రంథాలయంలో ఎక్కువ సమయం గడిపేవారు. ఈ కాలపు ఎంపీలు సభలో కనిపించరు. గ్రంథాలయాల్లోనూ కనిపించరు. సెంట్రల్ హాల్లో మాత్రమే వారిని చూడగలం. మొదటి మూడు సభల్లో ప్రఖ్యాతులు సభ్యులుగా ఉండేవారు. హిందూ జాతీయవాదుల నుంచి నిప్పులుగక్కే మార్క్సిస్టుల వరకు విభిన్న ఉన్నత సిద్ధాంతాలకు చెందిన సభ్యుల నియంత్రణ, సమన్వయం విషయంలో భారత పార్లమెంటు పోషించిన పాత్ర మరే పార్లమెంటు పోషించలేదని చరిత్ర విద్యార్థిగా సాధికారికంగా చెప్పగలను.

సి.ఎన్.అన్నాదురై ఒకసారి తమిళులకు సొంత దేశం

ఎందుకు కావాలో చెబుతూ పార్లమెంటులో ప్రసంగించారు. సభ్యులంతా ఓపిగ్గా విన్నారు. ఆయన తన వాదాన్ని ఎంత బలంగా వినిపించినా ఆ రోజు సాయంత్రానికి జాతీయవాదిగా మిగిలి పోయారు. భారత పార్లమెంటు ఇలాంటి తీవ్ర సిద్ధాంత వాదులకు నీడనిచ్చింది.

నేటి పార్లమెంటులోని విద్యాధిక సభ్యుల్లో శాస్త్ర, సాంకేతిక ఆర్థిక, మేనేజ్‌మెంట్ రంగాల్లో ఆరితేరిన వారున్నారు. అమెరికా, యూరప్ దేశాల్లో చదువుకొని వచ్చారు. వారు తమ విద్యానేపథ్యాన్ని సరిగ్గా వినియోగించుకోవాలి. కాని చాలా సమయాన్ని గుంపులు కట్టడం, సంబంధాలు పెంచుకోవడంలోనే వృధా చేస్తున్నారు.

సభలో ఉత్తమ ప్రసంగాలు చేసినప్పుడు మీడియాలో గుర్తింపు రావడం లేదు. గొడవలు, సరదా సంభాషణలకు అనవసరపు ప్రాధాన్యం ఇస్తున్నారు. గతంలో ఒకసారి నేను 15 రోజులు కసరత్తు చేసి సభలో ప్రసంగించాను. అంశాలను అధ్యయనం చేయడం, ఒక అవగాహనకు రావడం, సరైన పదాలు ఎంచుకోవడం ఎంతో కష్టపడ్డాను. నిజంగా ఇలా తయారుచేసుకున్న ప్రసంగం కవిత్వంతో సమానం. భారత మొదటి గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్ మీద బ్రిటన్ దిగువ సభలో ఎడ్మండ్ బర్కే చేసిన ప్రసంగం చదివితే తెలుస్తుంది. ఆ పండితుడు ఎన్ని వారాలు కసరత్తు చేశారో. గొప్ప పార్లమెంటేరియన్ కావాలంటే సాహితీ పిపాసి అయి ఉండాలి. మీరో గొప్ప ప్రసంగంచేసి, మీడియాలో వార్తే రాకపోతే మళ్లీ అలాంటి అనవసరపు ప్రయాసకు ఎందుకు సిద్ధపడతారు? అందుకేనేమో, ఇప్పటి ఎంపీలు వార్తా పత్రికల ఆధారంగా సహజ ప్రసంగాలకు అలవాటుపడ్డారు. వ్యవసాయం, సాంఘిక సంక్షేమంపై చర్చ ఉంటే మీడియా గ్యాలరీలో ఎవరూ ఉండరు. ఏదైనా సంఘటన జరిగితే సభలో అంతా మాట్లాడతారు. తీవ్రమైన చర్చల్లో పాల్గొనడానికి మాత్రం ఎవరికీ సమయం దొరకదు. అయితే, పార్లమెంటు సభ్యుల్లో ఇప్పటికీ నాణ్యత ఉంది. అలాంటి వారికి మంచి ప్రేరణ కరువైంది.

సంపన్నులు గతంలో కన్నా ఎక్కువగా పార్లమెంటుపై ఆధిపత్యం వహిస్తున్నారు. పార్టీలు డబ్బులున్న వారికే టికెట్లు ఇవ్వాలనుకుంటే అంతకన్నా విషాదం లేదు. గతంలో కన్నా ఎక్కువ మంది నిమ్నకులాల ప్రతినిధులు సభకు ఎన్నికవుతున్నా వారు ప్రభావ వంతంగా వర్గ సమస్యల్ని లేవనెత్తలేక పోతున్నారు. ప్రభావ వంతంగా మాట్లాడలేక పోవడంపై ఇంకా సాకులు చెల్లవు. మరింత కృషి చేయాలి. ప్రతీ వారినీ అంబేద్కర్‌ను ఉదాహరణగా తీసుకొమ్మని చెప్పను. అందరూ ఆయనంత మేధావులు కాలేకపోవచ్చు. కానీ, ఆయనంత కష్టపడే వాళ్లు మాత్రం కావొచ్చు.

సభలో గొడవలు అత్యంత ఆందోళన కలిగించే అంశం. విలువైన సమయం వృధా అవుతోంది. ఈ విషయంలో ప్రధాన పార్టీలూ తమ బాధ్యత నుంచి తప్పించుకోలేవు. కాంగ్రెస్, భాజపా, వామపక్షాలు కలిసి సభను సజావుగా జరిగేట్లు చూడాలి. నాణ్యమైన ప్రసంగాలను ప్రోత్సహించాలి. సభలో రోజూ గొడవ అంటే ఎలా? సభ ప్రశాంతంగా ఉందంటే హాజరు ఉండదు. ◆

**అటు నిప్పులుగక్కే వామపక్ష వాదులుగా గానీ, ఇటు కరడు గట్టిన హిందూ జాతీయవాదులుగా గానీ పార్లమెంటులోకి అడుగుపెట్టిన నేతలెవరూ పార్లమెంటు పదవీకాలం ముగిసేసరికి అంతే తీవ్రత కలిగిన అతివాదులుగా మిగిలిపోలేదు. వారి పంథాలోనే మితవాదులుగా మారారు. పార్లమెంటు ప్రతీ వాదానికి మధ్యేమార్గాన్ని కనుగొంది.**

**తొలితరం పార్లమెంటు సభ్యులు ఆక్స్‌ఫర్డ్ కేంబ్రిడ్జిలలో చదువుకున్నా వారు భారత పార్లమెంటు నుంచే ఎక్కువ నేర్చుకున్నారు. వారి ఆలోచనలకు విరుద్ధమైన భావాలతో సంఘర్షణలో రాటుదేలారు. హేతుబద్ధత ఉన్న ప్రతీ సభ్యుడి పైనా ఇతర సభ్యుల ఆలోచనా సరళి ఎంతోకొంత ప్రభావం చూపింది. పదహారేళ్ల ప్రాయంలో కమ్యూనిస్టుగా మారిన ఇంద్రజిత్ గుప్తా మరణించే వరకు కమ్యూనిస్టుగానే ఉన్నా గొప్ప ప్రజాస్వామ్య ఉదారవాదిగా తనువు చాలించారని నా అభిప్రాయం. వాజ్‌పేయి కరడుగట్టిన హిందూ జాతీయవాదిగా తన పార్లమెంటు ప్రస్తానాన్ని ఆరంభించినా మితవాద లౌకికవాదిగా మిగిలిపోయారని అంటాను. ఇదే భారత పార్లమెంటు సారం.**

**నేర చరితుల విషయంలో పార్టీలకు స్వీయ నియంత్రణ లేదు. విజయం తప్ప ఏ విలువలకూ పార్టీలు గౌరవం ఇవ్వడం లేదు. దశాబ్దాలుగా విపక్షంలో కూర్చున్న పార్లమెంటేరియన్లను వారి సేవలు, త్యాగాల ప్రాతిపదికన ఇప్పటికీ ప్రజలు గుర్తు పెట్టుకుంటున్నారని గ్రహించాలి. పార్టీలు నేర చరిత్ర ఉన్నవారికి టికెట్లు ఇవ్వబట్టే పార్లమెంటు ప్రతిష్ఠ దెబ్బతింటోంది. ఎంత పరపతి, డబ్బులు ఉన్నా నేర చరితులు స్వతంత్ర అభ్యర్థులుగా గెలవడం లేదనే విషయం పార్టీలు గ్రహించాలి. గుర్తింపు పొందిన పార్టీల టికెట్లతోనే వారు సభలోకి ప్రవేశిస్తున్నారు.**

# మేలైన చట్టాలు...శిలాక్షర శాసనాలు

**ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యానికి వేదికైన భారత పార్లమెంటు... దేశ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు చిహ్నం. తన 60 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో మేలైన చట్టాలు తీసుకొచ్చి, పాలనలోను, ప్రజాజీవితాల్లోనూ మార్పులకు శ్రీకారం చుట్టింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి వన్నె తెచ్చిన చట్టాల్లో కొన్నింటిని గురించి క్లుప్తంగా...**

## బ్యాంకుల జాతీయకరణ చట్టం

బ్యాంకులకు సంబంధించి భారతీయ రిజర్వు బ్యాంకు నిబంధనలు, నియంత్రణ చేస్తున్నా... స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మినహా దేశంలోని బ్యాంకులన్నీ ప్రైవేటు వ్యక్తుల చేతిలోనే ఉన్నాయి. 1960ల నాటికి భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో బ్యాంకింగ్ పరిశ్రమ కీలక సాధనంగా మారింది. దీనికితోడు విస్తృత స్థాయిలో ఉద్యోగాలు కల్పించే పరిశ్రమగానూ మారింది. దీంతో నాటి ప్రధాని ఇందిరా గాంధీ బ్యాంకుల జాతీయకరణ కోసం బ్యాంకింగ్ కంపెనీస్ (అక్విజిషన్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్) ఆర్డినెన్స్- 1969ని జారీ చేశారు. దీని కింద 1969,జులై19 అర్ధరాత్రి నుంచి 14 అతిపెద్ద వాణిజ్య బ్యాంకులు ప్రభుత్వ వశమయ్యాయి. దేశంలోని 85 శాతం బ్యాంకు డిపాజిట్లు ఈ బ్యాంకుల్లోనే ఉన్నాయి. అనంతరం రెండు వారాలకే బ్యాంకింగ్ కంపెనీలు (సేకరణ, సంస్థల బదిలీ) బిల్లును పార్లమెంటు ఆమోదించింది. అదే ఏడాది ఆగస్టు 9న ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. 1980లో రెండో విడత జాతీయకరణను ప్రభుత్వం చేపట్టింది. దీంతో దేశంలోని 91శాతం మేర బ్యాంకింగ్ వ్యాపారం ప్రభుత్వం పరిధిలోకి వచ్చినట్లయింది.

## రాజాభరణాల రద్దు చట్టం

దేశంలో బ్రిటిష్ పాలన ముగిసేనాటికి దేశంలో 565 సంస్థానాలు ఉన్నాయి. ఇవి భారత్‌తోనో పాకిస్థాన్‌తోనో విలీనమవుతున్నట్లు ఒప్పందాలపై సంతకాలు చేశాయి. కాశ్మీర్, జునాగఢ్, హైదరాబాద్ సంస్థానాలు తర్వాత విలీనమయ్యాయి. 1949లో సంస్థానాలు పూర్తిగా విలీనమై కొత్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఫలితంగా సంస్థానాధీశులు పాలనా హక్కులు కోల్పోయారు. ఆయా రాచకుటుంబాలకు భరణాలను చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రాష్ట్రం రెవెన్యూ తదితర అంశాలపై ఇవి ఆధారపడి ఉండేవి. పౌరులందరికీ సమాన హక్కులు కల్పించడానికి, ప్రభుత్వ రెవెన్యూ లోటును తగ్గించడంలో భాగంగా నాటి ప్రధాని ఇందిరా గాంధీ రాజాభరణాలను రద్దు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు తొలుత 1969లో రాజ్యాంగ సవరణకు పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టగా ఒకే ఒక్క ఓటు తేడాతో అది వీగిపోయింది. 1971లో మళ్లీ దీనిపై రాజ్యాంగ (26వ సవరణ) చట్టాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ఈ సారి దీనికి ఆమోదముద్ర పడింది.

## పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం

ఒక పార్టీ గుర్తుపై గెలిచి, రాత్రికిరాత్రే మరో పార్టీలోకి ఫిరాయించే ప్రజాప్రతినిధులకు కళ్లెం వేసేందుకు 1985లో ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు తీసుకొచ్చింది. ఇది రాజ్యాంగంలో పదో షెడ్యూల్‌గా చేరింది. దీనికింద... ఒక రాజకీయ పార్టీ తరపున ఎన్నికైన ప్రజా ప్రతినిధి. స్వచ్ఛందంగా తన రాజకీయ పార్టీ సభ్యత్వాన్ని వదులుకుంటే అనర్హత వేటు పడుతుంది. చట్టసభలో పార్టీ సూచనలకు విరుద్ధంగా ఓటు వేయడమో, అసలు వేయకపోవడమో చేసినా అనర్హత తప్పదు. ఒక పార్టీ ఇంకో పార్టీలో విలీనమయ్యే సందర్భంలో అనర్హత ముప్పు ఉండదు. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద చర్యలు తీసుకునే అధికారం సబంధిత చట్టసభల ఛైర్మన్, స్పీకర్‌కు ఉంటుంది.

## 73,74వ రాజ్యాంగ సవరణ చట్టం

ప్రధాని పీవీ నరసింహారావు ప్రభుత్వం 1991 సెప్టెంబరులో 73,74వ రాజ్యాంగ సవరణల బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టింది. 73వ సవరణ బిల్లు పంచాయితీలకు సంబంధించింది కాగా, 74వ బిల్లు నగరపాలక సంస్థలకు ఉద్దేశించింది. ఈ రెండు బిల్లులకు 1992 డిసెంబరులో పార్లమెంటు ఆమోదం తెలిపింది. బిల్లులపై ఏప్రిల్ 20,1993న రాష్ట్రపతి సంతకం చేశారు. పంచాయితీ రాజ్ చట్టం 1993,

ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి రాగా, నగరపాలక చట్టం జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. చట్ట పరిధిలో పంచాయితీలకు ఐదేళ్లకు ఒకసారి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి. వివిధ వర్గాల జనాభా వాటా ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయాలి. పంచాయితీల ఛైర్మన్ పదవికి పరోక్ష ఎన్నిక నిర్వహించాలి. జిల్లా ప్రణాళికా సంఘాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. పంచాయితీల పాలనకు 29 అంశాలను నిర్దేశించగా, నగర పాలికలకు 18 అంశాలను చట్టపరిధిలో నిర్దేశించారు.

## సమాచార హక్కు చట్టం

అధికార రహస్యమనే ముసుగును అడ్డు పెట్టుకొని, పారదర్శకతకు తిలోదకాలిస్తూ... అక్రమాలకు పాల్పడే అధికారగణం గుట్టురట్టు చేసే సాధనమే ఈ సమాచార హక్కు చట్టం. దీన్ని 2005, జూన్ 16వ పార్లమెంటు ఆమోదించింది. అదే ఏడాది అక్టోబర్ 12 నుంచి జమ్మూకాశ్మీర్ మినహా అన్ని రాష్ట్రాల్లోనూ అమల్లోకి వచ్చింది. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక చట్టం ఉంది. స.హ చట్టం ప్రజల పాలిట పాశుపతాస్త్రం అయింది. అప్పటి వరకూ అధికార రహస్యాల చట్టం- 1923 సహా వివిధ చట్టాలను సాకుగా చూపుతూ ప్రభుత్వ సమాచారాన్ని అధికారులు వెల్లడించేవారు కాదు. సహ చట్టం కింద ప్రభుత్వ విభాగాలు, శాఖల నుంచి పౌరుడు సమాచారాన్ని కోరవచ్చు. సంబంధిత శాఖలోని సమాచార అధికారి దీనిపై గరిష్ఠంగా 30 రోజుల్లోగా స్పందించాల్సి ఉంటుంది. ఈ చట్టం అమలు కోసం కేంద్ర సమాచార కమిషన్, రాష్ట్ర సమాచార కమిషన్లు ఏర్పడ్డాయి.

## గృహ హింస చట్టం

కుటుంబాల్లో భార్య, సహ జీవనం చేస్తున్న మహిళను భర్త, ఆయన తరపు బంధువుల వేధింపుల నుంచి రక్షించడానికి గృహ హింస నుంచి మహిళా రక్షణ చట్టం-2005ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టాన్ని పార్లమెంటు 2005 ఆగస్టులో ఆమోదించింది. అదే ఏడాది సెప్టెంబర్ 13న రాష్ట్రపతి ఆమోద ముద్రవేశారు. 2005, అక్టోబర్ 26 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. భౌతిక, లైంగిక దాడికి దిగడం, దుర్భాషలాడటం, భార్యను లేదా ఆమె తరపు బంధువులను వరకట్నం కోసం డిమాండ్ చేయడం వంటివి ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. ◆

# అరుదైన సమయం... అరవై ఏళ్ల పరువం...

*అరవై ఏళ్లంటే... వృత్తి ఉద్యోగాలకు విరమణ తీసుకుని.. షష్టిపూర్తి సంబరాల్లో విశ్రాంతి తీసుకునే వయసు! మనుషులకైతే అంతే! కాని వ్యవస్థలకు మాత్రం కాదు. అదీ శత సహస్ర హృదయాల గుండె చప్పుడు వినిపించే... అడుగు తడబడకుండా దేశాన్ని నడిపించే వ్యవస్థలకు అసలే కాదు! అందుకే ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యానికి గుండెకాయ వంటి పార్లమెంట్‌కు అరవై ఏళ్లు వచ్చినా ఇప్పటికీ మనం... బాలారిష్టాల గురించి, ఉరకలెత్తే యవ్వనం దూకుళ్ల గురించి మాట్లాడుకుంటూనే ఉన్నాం! ఎంత పరిణతి సాధించామని అంచనాలు వేసుకుంటూనే ఉన్నాం.*

*మొత్తానికి అనుమానాలు వీడిపోయాయి! దేశభక్తి శిఖామణులు... స్వతంత్ర సంగ్రామ యోధులు... జాతి నిర్మాతల తరం వెళ్లిపోయిన తర్వాత... దేశం దిగజారిపోతుందన్న భయాలు చెదిరిపోయాయి. వారి దార్శనికత గొప్పదేనని... ఆ పునాదులు గట్టివేనని... అవంత తేలికగా చెక్కు చెదరవని నిరూపిస్తున్నాయి. ఈ అరవయ్యేళ్ల అడుగులు! ఏక పార్టీ స్వామ్యం దాటుకుని... ఎమర్జెన్సీ నియంతృత్వ పోకడలను అధిగమించి... ప్రజాస్వామ్యానికి కొత్త అర్థాలు వెతుక్కుంటూ... భిన్న పక్షాల, విభిన్న వాదనలు, వైరుధ్యపక్షాల సమన్వయంతోనూ సంకీర్ణంగానూ సభలు నిలబడే పరిణతి దిశగా సాగుతోంది. మన అరవయ్యేళ్ల పార్లమెంట్! నిస్సందేహం!*

*1952లో సుప్రతిష్ఠితమైన తొలి సభనాటి నుంచీ నేటి 15వ సభ వరకూ... భారత పార్లమెంటు సాధించిన విజయాలు కాస్త ఎక్కువేగానీ తక్కువేం కాదు. అయితే అంతటితో సంతృప్తిపడిపోయే వయసు కాదిది! తడబడిన అడుగులను సరిచూసుకుంటూ... మెరుగు తరుగులను సమీక్షించుకుంటూ.. ముందుకు నడవాల్సిన తరుణం ఇది! ఇప్పుడిప్పుడే ప్రవర్ధమానమవుతున్న ప్రపంచ ప్రజాస్వామ్యాలకు మార్గదర్శిగా నిలవాల్సిన మన పార్లమెంట్ చర్చల స్థాయి దిగజారిందా? సభ్యుల స్థాయిమెరుగయ్యిందా? ప్రజా ప్రతినిధులుగా సమున్నత సభలో అడుగుపెట్టిన శాసన నిర్మాతలంతా తమ తమ బాధ్యతలను సంతృప్తికరంగా నిర్వర్తిస్తున్నారా? భారత ప్రజాస్వామ్యానికి పహారా కాయటంలో పార్లమెంట్ ఎటువంటి పాత్ర పోషిస్తోంది? జాతీయ పరిణామాలకు ఎంత వరకూ జవాబుదారీతనం వహిస్తోంది? ఈ అరవై ఏళ్ల ప్రస్థానాన్ని సమీక్షించుకుని... ముందడుగు వేస్తున్న తరుణంలో దేశం ముందర ఎన్నెన్నో సంతోషాలు... సరిదిద్దుకోవాల్సిన సంశయాలు!*

## కూకట్‌పల్లి – ఈ అభివృద్ధి మన సొంతం

# రాష్ట్రంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న నియోజకవర్గం మనదే!

కరపత్రం



మిత్రులారా,

కూకట్‌పల్లి అభివృద్ధి ముఖచిత్రం మార్చుకునే దిశగా 2009లో మీరంతా ముందుండి 'మార్పు'కు నాంది పలికారు. రాష్ట్రంలో మరే నియోజకవర్గానికీ విడుదల కానంత స్థాయిలో 800 కోట్ల రూపాయలకు పైగా నిధులను కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధి కోసం విడుదల చేయించడం జరిగింది. కింద పేర్కొన్న పలు అభివృద్ధి కార్యక్రమాలు ఈ కృషిలో భాగంగా జరిగినవే. ఇందుకు సంబంధించిన ఒక క్లుప్తమైన నివేదిక ఇది.

1) గతంలో 3 కోట్ల 60 లక్షల లీటర్లున్న మంచినీటి సరఫరాను 7 కోట్ల లీటర్ల స్థాయికి పెంచడం జరిగింది.
2) కృష్ణా జలాల మూడవ ఫేజ్ నీటిని హైదరాబాద్ తీసుకురావడం కోసం ఇతర శాసనసభ్యులతో కలిసి కృషి చేస్తున్నారు.
3) పైప్‌లైన్లు, వాటర్‌ట్యాంక్ సంప్‌ల కోసం రు.10 కోట్ల నిధుల మంజూరు జరిగింది.
4) 2005 నుంచి పెండింగ్‌లో వున్న మూసాపేట, హస్మత్‌పేట వాటర్‌ట్యాంక్‌ల నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి, త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి.
5) ట్రాఫిక్ సమస్యల నివారణ, రోడ్ల అభివృద్ధి, డ్రెయినేజీలను మెరుగుపరచడం కోసం రు. 253 కోట్ల నిధులను మంజూరు అయినవి. పనులు పురోగతిలో వున్నాయి.
6) నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 75 పాఠశాల గదులు, 74 మరుగుదొడ్లను నిర్మించడం జరిగింది.
7) నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం రు.323 కోట్లను మంజూరు చేయించడం జరిగింది. ఇందులో భాగంగా 33 కె.వి సబ్‌స్టేషన్లు నాలుగు, ఒక 220 కె.వి సబ్‌స్టేషన్, ఒక 110 కె.వి సబ్‌స్టేషన్ల నిర్మాణం జరుగుతోంది. అలాగే, 250 (11 కె.వి స్థాయి) ట్రాన్స్‌ఫార్మర్లు, 10 వేల విద్యుత్‌లైట్ల ఏర్పాటు పూర్తయింది.
8) లోక్‌సత్తా పార్టీ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో భాగంగా ఇప్పటికి 2287 మంది వివిధ కంపెనీలకు ఎంపికైనారు.
9) గ్రీన్ కూకట్‌పల్లి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో వేలాది చెట్లను నాటించడం, వాటికి రక్షణ ఏర్పాట్లు చేయడం జరిగింది.

### ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు

1) 2005 నుంచి పెండింగ్‌లో వున్న హస్మత్‌పేట వాటర్‌ట్యాంక్ నిర్మాణం పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగింది.
2) మంచినీటి పైపులైన్ కోసం స్వర్గధామ నగర్‌లో తొలిసారిగా 30:70 నిధులను జలమండలి ద్వారా మంజూరు చేయించడం జరిగింది.
3) హస్మత్‌పేట నాలా వెడల్పు పనులు జరుగుతున్నాయి.
4) 17 కోట్ల రూపాయల నిధులతో డివిజన్‌లోని 53 కాలనీల్లో రోడ్లు మరియు భూగర్భ డ్రయినేజీ పనులను పూర్తిచేయించడం జరిగింది.
5) బాలానగర్‌లో ఫ్లైఓవర్ నిర్మాణం కోసం 90 కోట్ల రూపాయల నిధుల్ని విడుదల చేయించడం జరిగింది.
6) 425 వీధిదీపాల ఏర్పాటు పూర్తయింది.
7) మంచినీటిలో మురుగునీరు కలవకుండా ప్రత్యేక పైప్‌లైన్ నిర్మాణాన్ని కోటి రూపాయల వ్యయంతో పూర్తిచేయడం జరిగింది.
8) ఇప్పటిదాకా సుమారు 35 బోర్‌వెల్స్ ఏర్పాటు జరిగింది. త్వరలో మరిన్ని బోర్‌వెల్స్ ఏర్పాటు కానున్నాయి.
9) దిల్‌కుష్‌నగర్‌లో ఎంతోకాలంగా పెండింగ్‌లో వున్న రేషన్‌షాపును మంజూరు చేయించడంతోపాటు, మరో 2 కొత్త రేషన్‌షాపులను ఏర్పాటు చేయించడం జరిగింది.
10) కమ్యూనిటీహాల్ నిర్మాణం, రెండు పార్కుల అభివృద్ధి జరిగింది.
11) ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా 20 తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం జరిగింది.

### చేయబోతున్న అభివృద్ధి కార్యక్రమాలు

1) ఎంతోకాలంగా రోడ్డు లేక ఇబ్బందిపడుతున్న దిల్‌కుష్‌నగర్ వాసుల కోసం ఐడిపిఎల్ నుంచి రోడ్డు నిర్మాణం కోసం కలెక్టర్‌కు లేఖ రాయడం జరిగింది. త్వరలోనే ఈ రోడ్డు నిర్మాణపనులు ప్రారంభమవుతాయి.
2) ప్రభుత్వ భూముల్ని పరిరక్షించడం, పిహెచ్‌సిలు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, సామాజిక భవనాల నిర్మాణానికి కృషి కొనసాగుతోంది.
3) బాలానగర్ నాలాలో రిటర్నింగ్ వాల్ నిర్మించే కృషి జరుగుతోంది.

డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ కూకట్‌పల్లి శాసనసభ్యునిగా ఎన్నికయ్యాక, రాష్ట్రంలో మరే నియోజకవర్గం కంటే మెరుగ్గా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇది చరిత్ర చెప్తున్న వాస్తవం. మీరంతా కలిసివస్తే మన నియోజకవర్గం శాశ్వతంగా అభివృద్ధి దిశగా ప్రయాణించేందుకు మరెన్నో కార్యక్రమాలు చేపట్టడానికి లోక్‌సత్తా పార్టీ సిద్ధంగా వుంది.

**visit : kukatpallynow.com, 040-40150139**

# పెదగొట్టిపాడు మద్య వ్యతిరేక ఉద్యమకారిణే ప్రత్తిపాడు ఉప ఎన్నికల్లో లోక్‌సత్తా పార్టీ అభ్యర్థి



గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు గ్రామం దళితవాడలోని లైసెన్స్‌డ్ మద్యం దుకాణాన్ని తొలగించాలని, బెల్టు షాపుల్ని మూసివేయాలని 2007 అక్టోబర్‌లో పెదగొట్టిపాడు నుండి గుంటూరు వరకు జేపీ నిర్వహించిన 3 రోజుల పాద యాత్రలో పాల్గొన్న శ్రీమతి జొన్నలగడ్డ జయభాగ్యం.

జయభాగ్యంనే జూన్ 12, 2012 న జరగనున్న ఉప ఎన్నికల్లో ప్రత్తిపాడు అభ్యర్థిగా లోక్‌సత్తా పార్టీ ప్రకటించింది.

నాడు జేపీ పాదయాత్ర దృశ్యమాలికను ఒకసారి చూద్దాం...











'లోక్‌సత్తా' పాదయాత్ర
మద్యనిషేధం కోరుతూ
మత్తు వదిలిస్తాం
బెల్టు షాపులతోనే ఆగదు ఉద్యమం
ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో తాగేందుకు చెరువు నీరే గతి
ఆన్‌లైన్‌తో జేపీ పాదయాత్ర అనుభవాలు
పాదయాత్ర... రైతులతో ముచ్చట
జేపీ పాదయాత్రకు అనూహ్య స్పందన
బెల్ట్ షాపులపై ఉద్యమానికి మహిళల నీరాజనం











ప్రభుత్వం ఒప్పుకుంటే నిధుల కోసం
జోలె పడతాం
మద్యంతో అభివృద్ధిని
ముడిపెట్టద్దు
లోక్‌సత్తా నేత
Guntur
Padayatra
Padayatra for a new era
CITY
Jayaprakash on 64-km walk to campaign against belt shops
Total prohibition is Jayaprakash Narayan's goal
జెపి పాదయాత్రలో
కదంతొక్కిన మహిళలు







# జగనూ...భక్త రామదాసు

- మైత్రీజ్వాల

*ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్ర రాజకీయాలు కూడా పొగలు కక్కుతున్నాయి. రెంటీవేడీ కలిసి ప్రజలు కుమిలిపోతున్నారు. ఏ టీవీ పెట్టినా, పత్రికలు చదివినా,పత్రికా స్వేచ్ఛ అవునా? కాదా? అయితే ఎలా? కాకుంటే ఎలా? చర్చలు జరుగుతున్నాయి. మేధావులందరూ రకరకాలుగా చీలిపోయి రెండు వాదనలూ వినిపిస్తున్నారు. ఎండాకాలంలో పత్రికలో ఈ విషయంపై ఓ 'కాలం' రాయడానికి ఏమైనా ఐడియా ఇస్తాడేమోనని పొద్దున్నే మా మావయ్య ఇంటికి వెళ్ళాను. ఆయన ఇంట్లో టీవీ లేదు. ఇంకా పాతకాలపు రేడియో ఒకటి పెట్టుకుని ఆకాశవాణి, వివిధ భారతి నుండి బిబిసి వరకు వార్తలు, పాటలు పద్యాలు వింటూవుంటాడు. నేను వెళ్ళేసరికి రేడియోలో పాట వస్తుంది.*

*"చుట్టు ప్రాకారాలు సొంపుగా కట్టిస్తి రామచంద్రా... ఆ ప్రాకారముకు పట్టే పదివేల వరహాలు రామచంద్రా.. లక్ష్మణుకి చేయిస్తి ముత్యాలపతకమూ రామచంద్రా... ఆ పతాకానికీ పట్టే పదివేల మొహరీలు రామచంద్రా.... సీతమ్మకు చేయిస్తి చింతాకుపతకమూ రామచంద్రా... ఆ పతకానికీ పట్టే పదివేల వరహాలు రామచంద్రా.... కలికీతురాయి నీకూ.. కొలుపుగా చేయిస్తి రామచంద్రా... అలా భద్రాచలం రామమందిరం నిర్మాణానికి ఏమేమి ఖర్చు పెట్టాడు వాటికి ఎన్ని వేల మొహరీలు, వరహాలు ఖర్చయ్యాయి ఈ డబ్బంతా ఎవడబ్బ సొమ్మని రామదాసు రాముణ్ణి ప్రశ్నిస్తాడు. నీ తండ్రి దశరధమహారాజు పంపెనా... లేక నీ మామ జనక మహారాజు పంపెనా అని అడుగుతాడు. ఇలా అడిగి ఊరుకోడు రామదాసు. ఎవడబ్బ సొమ్మని కులుకుతూ తిరిగేవు అని రాముణ్ణి దెప్పి పాడుస్తాడు". ఇలా సాగుతుంది ఈ పాట. అప్పుడు నా నోటి నుండి జగనూ... భక్తరామదాసు అనే మాట అప్రయత్నంగా వచ్చింది.*

జగనూ... భక్త రామదాసు అనేగానే ఛ.... ఛ.... ఇదేం అపవిత్ర కలయిక అన్నాడు. మా మావయ్య. ఆయన ఒక ప్రఖ్యాత దిన పత్రికలో సబ్ ఎడిటర్ ఉద్యోగం వెలగబెడు తున్నాడు. ఇటీవల ఒక పత్రిక అకౌంట్లను సిబిఐ వాళ్ళు సీజ్ చేసిన సందర్భంలో జరుగుతున్న అలజడులు, జర్నలిస్టుల ఆందోళనలు చూసి ఏది పత్రికా స్వేచ్ఛ ఏదీ కాదు... ఓ మహాత్మా, మహర్షీ అనే ధర్మ సందేహంలో పడిపోయి తనలో తనే మాట్లాడుకుంటున్నాడు. "కోప్పడకు మావయ్యా చట్టం ముందు అందరూ సమానులే అని చెప్పడానికే ఈ పోలిక వాడాను" అని శాంతపరిచాను. 'నేనొప్పుకోను' అన్నాడు మావయ్య. 'కన్విన్స్ చేస్తే ఒప్పుకుంటావా' అన్నాను. 'అయితే ఓకే' అన్నాడు మావయ్య. చెప్పడం మొదలెట్టాను.

భక్త రామదాసు తానీషా రాజు పాలనలో ఒక సాధారణ తహశీల్దారు. ప్రజల నుండి వచ్చిన పన్నుల డబ్బుల్ని వెచ్చించి తను నమ్మిన దైవానికి ఒక గుడి కట్టించి ఆ దేవతలకి ఆభరణాలు కూడా చేయించాడని అభియోగం. ఇది చట్టప్రకారం నేరం. దానికి తానీషా రామదాసును జైల్లో పెట్టాడు. ప్రజల పన్నుల డబ్బుని రామదాసు వాడలేదని, ఖజానాకి డబ్బు పంపిస్తే మధ్యనున్న వాళ్ళు వాడుకుని ఆయనను జైలుపాలు చేశారని రామదాసు అమాయకుడనే వాదన కూడా వుంది. తప్పు చేయకపోయినా నిర్దోషి అని తేలేదాకా రామదాసు జైల్లో వున్నాడు. పన్నుల డబ్బు ఖజానాకు చేరలేదనే అభియోగమే ఆయనను జైలుపాలు చేసింది. ఆ తరువాత కథ మనకు తెలిసిందే. అర్ధరాత్రి రామలక్ష్మణులు తానీషాకు ప్రత్యక్షమై ఆయన ఖజానాకు చేర్చాల్సిన డబ్బుల్ని పైసాతో సహా లెక్కతేల్చి అంతకంటే ఎక్కువే వరహాలను కుప్పగా పోసి రామదాసును చెర నుంచి విడిపిస్తారు.

పబ్లిక్‌మనీని పవిత్ర కార్యానికి వాడినా, రామమందిరమే నిర్మించినా తప్పు తప్పే అనేది చట్టం చెప్పింది. ఆ డబ్బు వసూలయ్యేదాకా మంచివాడు కూడా శిక్షను అనుభవించవలసి వచ్చింది. అలాగే అభియోగాలున్న అకౌంట్లనుండి డబ్బును తీసుకువచ్చి ఒక పత్రిక యాజమాన్యం జీతాలు చెల్లిస్తున్నా తప్పు తప్పే. అపవిత్రమైన ఆరోపణలున్న పెట్టుబడులను పత్రికలో పెట్టుబడులు పెడితే అవి పవిత్రమైపోవు. ఈ లాజిక్ అర్థం చేసుకుంటే పత్రికా స్వేచ్ఛను అరికడుతున్నారు అనే మేధావులకి సమాధానం దొరుకుతుంది. అలాగని సిబిఐ వాళ్ళు చేసిందంతా సరైనదే కాకపోవచ్చు. ఒక మేలు చేసినదానికి మరోచోట లబ్ధి పొందే 'క్విడ్‌ప్రోకో' ప్రకారం ఆ పెట్టుబడులు పత్రికలోకి ఎలా వచ్చాయో నిరూపించాల్సిన బాధ్యత ప్రాసిక్యూషన్ (సిబిఐ) పై వుంది. అంతవరకు విచారణలో భాగంగానే ఈ చర్యలన్నీ పరిగణించాలి తప్ప వీటికి పత్రికా స్వేచ్ఛ లాంటి భాష్యాలు చెప్పడం సరికాదు. ◆

# ఒక్క లక్ష్మణ్‌కే శిక్ష విధించే వివక్ష వ్యవస్థను ఇంకా సహిద్దామా? మార్చుకుందామా?

అవినీతి వల్ల, అవినీతిని అరికట్టేందుకు సరైన వ్యవస్థీకృత ఏర్పాట్లు లేకపోవటం వల్ల, ఉన్న చట్టాలను కూడా సక్రమంగా అమలుచేయకపోవటం వల్ల అత్యధికంగా నష్టపోయేది పేదలు, బలహీనవర్గాలేనని పలు శాస్త్రీయ అధ్యయనాలు రుజువు చేశాయి. అందుకు మన కళ్ల ముందు కనిపిస్తున్న తాజా ఉదాహరణ- బీజేపీ మాజీ అధ్యక్షుడు, మాజీ కేంద్ర మంత్రి బంగారు లక్ష్మణ్‌కు జైలుశిక్ష విధిస్తూ ఢిల్లీ కోర్టు ఇచ్చిన తీర్పు.

2001 సంవత్సరంలో బీజేపీ కార్యాలయంలో రూ. 1లక్ష లంచం తీసుకుంటూ తెహల్కా డాట్‌కామ్ స్టింగ్ ఆపరేషన్‌లో లక్ష్మణ్ పట్టుబడ్డారు. భారత సైన్యానికి థర్మల్ బైనాక్యులర్లు సరఫరా చేసే కాంట్రాక్టును ఇప్పించేందుకుగాను లక్ష్మణ్ ఈ మొత్తం తీసుకుంటూ కెమేరాలకు చిక్కారు. ఈ లక్షను అడ్వాన్స్‌గా ఇస్తూ మరో రూ. 4లక్షలు తర్వాత చెల్లించేట్టుగా అవతలివారు లక్ష్మణ్‌తో ఒప్పందం కుదుర్చుకున్న వైనమంతా స్పష్టంగా రికార్డయింది. ఇన్నేళ్ల విచారణ అనంతరం అదనపు సెషన్స్ జడ్జి ఏప్రిల్ 28, 2012న తీర్పు వెలువరిస్తూ... బంగారు లక్ష్మణ్‌కి నాలుగేళ్ల జైలుశిక్ష, రూ. 1లక్ష జరిమానా లేదా ఆరునెలల అదనపు జైలుశిక్ష విధించారు.

లక్ష్మణ్ నేరాన్ని ఎవరూ సమర్థించరు, అలాగే శిక్షను ఎవరూ తప్పుపట్టరు. కానీ లక్ష్మణ్ గనక ఓ సోనియా గాంధీనో, ఓ చంద్రబాబో, ఓ వైఎస్ జగన్మోహన రెడ్డో అయ్యుంటే ఆయనకు ఈ శిక్ష పడేదా అనేది మాత్రం కాస్త సామాజిక స్పృహ ఉన్న వారందరి మనసుల్నీ తొలిచే ప్రశ్న. తెహల్కా స్టింగ్ ఆపరేషన్లో పట్టుబడ్డప్పుడు లక్ష్మణ్ మాట్లాడుతూ... ఆ డబ్బును తాను వ్యక్తిగతంగా తీసుకోలేదని, పార్టీ నిధి కిందే తీసుకున్నానని చెప్పారు. ఆనాడు బీజేపీ కూడా అదే మాట చెప్పింది.

పార్టీలు తీసుకుంటున్న విరాళాల లెక్కల్ని బైటికి తీస్తే లక్ష్మణ్ కంటే అనేక రెట్లు ఎక్కువ శిక్షలు అన్ని సాంప్రదాయ పార్టీల నేతలకీ పడాలి. సోనియా గాంధీనో, చంద్రబాబో, జగన్మోహన రెడ్డో నిర్వహిస్తున్న మీటింగులకు, జరుపుతున్న ప్రచార కార్యక్రమాలకు కోట్ల రూపాయల ఖర్చు ఎక్కడ్నుంచి వస్తోందని మనలో ఎవరైనా ఎప్పుడైనా ప్రశ్నించారా? కనీసం మన అంతరాత్మలనైనా సీరియస్‌గా ప్రశ్నించుకున్నామా? ఎప్పుడైనా మన మీడియాలో చర్చించారా? అలా ప్రశ్నించుకుని,



చర్చించుకుని ఉంటే లక్ష్మణ్ కంటే అనేక రెట్లు ఆ బడానేతలు దోషులని మనకు అర్థమయ్యేది. అలాగే లక్ష్మణ్‌కి ముందు, ఆ తర్వాతా బీజేపీ కూడా అలా లెక్కలు చెబుతోందా అంటే అదీ లేదు. బీజేపీ తీసుకుంటున్న దాదాపు 95శాతం పార్టీ నిధుల్ని లెక్కలు చూపకుండానే తీసుకుంటోందని ఆ పార్టీ సీనియర్ నేత, కాస్తో కూస్తో నిజాయతీపరునిగా పేరొందిన అరుణ్‌జైట్లీ కూడా కొన్ని ప్రైవేటు సంభాషణల్లో అంగీకరించినట్టు విశ్వసనీయ సమాచారం. మరి వీళ్లెవరికీ లేని శిక్షలు లక్ష్మణ్‌కే ఎందుకు పడ్డాయి అంటే దొరికారు కాబట్టి అని మాత్రమే సరిపెట్టుకోవాల్సి వస్తుంది. స్టింగ్ ఆపరేషన్లు, చట్టాలు మిగిలిన నాయకుల విషయంలో ఎందుకు సక్రమంగా పనిచేయటం లేదంటే సమాధానం దొరకదు. కులం, రాజకీయ దన్ను వంటివి

పట్టించుకోకుండా అవినీతిపై కొరడా ఝుళిపిస్తే మిగిలినవాళ్లు కూడా దొరికేవారనటంలో సందేహం లేదు.

ఇక రెండో కోణానికొస్తే... సరిగ్గా ఇదే తరహాలో దేశరక్షణకు సంబంధించిన బోఫోర్సు తుపాకీల కుంభకోణంలోనే సోనియాగాంధీ సహా కాంగ్రెస్ పార్టీ ఉన్నతస్థాయి నేతల మీద ఆరోపణలు వచ్చాయి. అనేక పత్రాలలో సాక్ష్యాలు స్పష్టంగా కనపడుతున్నా అటు కాంగ్రెస్ ప్రభుత్వం, ఇటు ఎన్డీయే ప్రభుత్వం దోషుల మీద కఠిన చర్యలు తీసుకుని కఠిన శిక్షలు విధించే దిశగా గట్టి ప్రయత్నం చేయలేకపోయాయి. కాంగ్రెస్, బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వాలు అడ్డంకొట్టటం వల్లే సీబీఐ బోఫోర్సు కేసును నీరుగార్చిందని మనం నిరూపించలేకపోవచ్చు, కానీ మన కామన్‌సెన్స్‌కి తేలిగ్గా అర్థమయ్యే వాస్తవమది. అలాంటి రక్షణ లక్ష్మణ్‌కి లభించకపోవటం వల్లే ఆయనకు జైలుశిక్ష పడిందని వాదించటానికి మనమేమీ తటపటాయించాల్సిన పన్లేదు కూడా. అధికారంలోకి వచ్చాక వేలకోట్లకు ఎదిగిన చంద్రబాబు, చాలా తీవ్రమైన అవినీతి కేసులో తొలిముద్దాయిగా వున్న వైఎస్ జగన్మోహనరెడ్డికి వున్న న్యాయసహాయం లక్ష్మణ్‌కి కూడా వుండి వుంటే ఆయన కూడా కేసుని తప్పించుకుని నిర్దోషిగా బైటపడేవారని మన రాష్ట్రంలో కొందరు చేస్తున్న వాదనల్ని కొట్టిపారేయలేం కూడా. నిరూపించలేకపోయినా దాన్ని కూడా నిజమేనని అంగీకరించక తప్పదు. పార్టీ కోసమే లక్ష్మణ్ విరాళం తీసుకున్నారని కేసు తొలినాళ్లలో మాట్లాడిన బీజేపీ ఆ తర్వాత వ్యూహాత్మక మౌనం వహించింది. కనీసం సరైన న్యాయపోరాటం చేసేందుకు కూడా ప్రయత్నం చేయలేదు. తీర్పు వచ్చాక... ఆ అంశం లక్ష్మణ్ వ్యక్తిగత విషయమని, పైకోర్టుకు వెళ్తారని, చేయగలిగింది చేస్తామని ముక్తసరిగా తేల్చేసింది. కాంగ్రెస్ పార్టీ సీబీఐని సొంత ప్రయోజనాలకు వాడుకుంటోందని విమర్శిస్తోంది తప్ప జాతీయస్థాయిలో సీబీఐని, రాష్ట్రాలలో ఏసీబీకి జవాబుదారీతనంతో కూడిన స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించి బలమైన అవినీతి నిరోధక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఇప్పటికి కూడా బీజేపీ చిత్తశుద్ధితో వాదించటం లేదు. పార్టీల నిధుల సేకరణ తీరును మార్చేందుకు, ఎన్నికలలో ధనప్రవాహాన్ని ఆపేందుకు సంస్కరణలు తేవాలని కోరటం లేదు. లక్ష్మణ్ ఉదంతం జరిగాక తాను అధికారంలో వుండి కూడా ఆ దిశగా ప్రయత్నం చేయలేదనే వాస్తవం పట్ల కూడా బీజేపీ పశ్చాత్తాపాన్ని ప్రదర్శించటం లేదు. అదృష్టం బాగుండి, రాజకీయ ఒప్పందాలు కుదిరితే లక్ష్మణ్‌ను ఎప్పటికైనా బైటపడేసి ఆ క్లీన్‌చిట్‌ను రాజకీయంగా వినియోగించుకునే ప్రయత్నం చేస్తాం, లేకపోయినా పెద్దనష్టం లేదు, కానీ వ్యవస్థలో మార్పులు మాత్రం అక్కర్లేదు అనే ధోరణితో బీజేపీ వ్యవహరిస్తోంది.

అలాగే ప్రధాన ప్రత్యర్థి పార్టీ మాజీ జాతీయ అధ్యక్షుడికి దేశరక్షణకు సంబంధించిన అవినీతి కేసులో శిక్ష పడితే దేశమంతా గందరగోళం చేసి ప్రచారం చేయాల్సిన కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక చిన్న ప్రకటనకే పరిమితమై పోవటం కూడా చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. **ఎంపిక చేసుకున్న అవినీతి అంశాలపై, కుంభకోణాలపై మాత్రమే స్పందించాలని, ప్రత్యర్థులుగా యుద్ధం చేస్తున్నట్టు కనపడాలని, ఆ క్రమంలో కొందరు బలహీనులను బలిపశువుల్ని చేయాలని కాంగ్రెస్, బీజేపీ లాలూచీ పడ్డట్టు కనిపిస్తుంది. లక్ష్మణ్ విషయంలో ఆ రెండు పార్టీల వ్యవహారశైలి చూస్తుంటే మాజీ బీజేపీ సీనియర్ నేత, రాజకీయ-సామాజిక ఉద్యమకారుడు కె.ఎన్ గోవిందాచార్య ఇటీవల ఓ టీవీ ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు గుర్తుకొస్తున్నాయి-"భారతదేశంలో రెండు ప్రధాన జాతీయపార్టీలు ఉన్నాయి. ఒకటి కాషాయ కాంగ్రెస్ (బీజేపీ), రెండోది మూడురంగుల కాంగ్రెస్. పేరులోనే తప్ప ఆ రెండు పార్టీల మధ్యా మౌలికంగా తేడా ఏమీ లేదు. నాణేనికి బొమ్మా బొరుసూ వంటివి. ప్రత్యామ్నాయ విధానాలతో సరైన జాతీయ పార్టీ లేకపోవటం మన ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం" అనే భావనను గోవిందాచార్య వ్యక్తం చేశారు.**

పుట్టుకతో వివక్ష లేకుండా తమ సామర్థ్యం మేర ఎదిగే అవకాశాలు అందరికీ ఉండి, అందరినీ చట్టాలు సమానంగా వర్తిస్తుంటే ఎవరికి శిక్ష వేసినా మనం పట్టించుకోవాల్సిన పన్లేదు. కానీ అవినీతికి పాల్పడితే సోనియా స్థాయిలోనో, చంద్రబాబు స్థాయిలోనో, జగన్ స్థాయిలోనో వెనక దన్ను వుంటే ఒక రకమైన న్యాయం జరుగుతోంది, అవేవీ లేకపోతే లక్ష్మణ్‌లాగా మరోరకం న్యాయం జరుగుతోంది అనే పరిస్థితులు ఈవేళ నెలకొన్నాయి. అందుకే ఇటీవల చంద్రబాబు అక్రమ ఆస్తులపై సీబీఐ విచారణ కోరుతూ వైఎస్ విజయ పిటిషన్ దాఖలు చేసినప్పుడు ఒక సీనియర్ జర్నలిస్టు చంద్రబాబుకు ఒక హెచ్చరిక చేశారు. చంద్రబాబూ, మీకు ప్రత్యర్థిగా ఉన్నది మీకంటే తక్కువస్థాయి

వ్యక్తులు కాదు, కులంలో, రాజకీయ, ఆర్థిక దన్నులో మీకు దీటైనవారు అని ఆయన హెచ్చరించారు. దీని అర్థమేమిటి? చట్టం అందరికీ సమానంగా వర్తించే పరిస్థితులు లేవని మరోమారు గుర్తుచేయటమేగదా? ఇందుకు ఎవరినో నిందిస్తూ కూర్చుంటే లాభం లేదు. ఈ పరిస్థితులలో పరిష్కారం ఏమిటి? మనం అందులో ఎలా భాగస్వాములం కావాలి? అని ఆలోచించి తగిన కార్యాచరణతో ముందుకెళ్తేనే పరిష్కారాన్ని సాధించుకోగలం. పరిష్కారం కోసం ప్రయత్నించకపోతే ఈ వివక్షకు మున్ముందు మనం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

## మంచి రాజకీయానికి అండగా నిలవటం, ఓటు వేయటమే పరిష్కార మార్గం

ఏం చేయాలి అంటే... అన్ని సాంప్రదాయ పార్టీలలో అనేకమంది బంగారు లక్ష్మణ్‌లు వున్నా కేవలం ఒక్క దళిత బంగారు లక్ష్మణ్‌కే శిక్షపడేలా చేసిన వ్యవస్థీకృత వివక్షను పెంచి పోషిస్తున్నది రాజకీయమేనని ముందు స్పష్టంగా గుర్తించాలి. ఆ రాజకీయాన్ని మార్చేందుకు గట్టి సంకల్పాన్ని ప్రదర్శించాలి. వివక్షను అంతం చేసే విధానాలుగల రాజకీయాన్ని తెచ్చుకునేందుకు మనకున్న స్వేచ్ఛను, ఓటుహక్కును రాజీలేకుండా వినియోగించుకోవాలి.

చట్టం ముందు అందరూ సమానమే, వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాల్ని కల్పించాలి అన్న భారత రాజ్యాంగాన్నే ప్రమాణంగా తీసుకుని, రాజ్యాంగ విలువల్ని పాటిస్తూ చేసే రాజకీయాన్ని పెంచి పోషించుకోవాలి. అవినీతికి పాల్పడ్డవారు ఎంతటివారైనా ఏ స్థాయిలోవారైనా వారిని పదవుల నుంచి తొలగించి జైలుకు పంపటంతోపాటు వారి ఆస్తుల్ని కూడా జప్తుచేయాలని, ఇందుకోసం నేరపరిశోధనాసంస్థలకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించి బలమైన లోకాయుక్త, లోక్‌పాల్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు వ్యవస్థీకృత ఏర్పాట్ల కోసం పోరాడాలి. రాజకీయ పార్టీలలో వారసత్వ, కుటుంబ రాజకీయాలకు అడ్డుకట్ట వేసి అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పెంపొందించి అవి తీసుకునే విరాళాలకు ఖచ్చితంగా లెక్కచెప్పే ఏర్పాట్ల కోసం నిలదీయాలి. ఇందుకు వ్యతిరేకంగా వుండే పార్టీలను, నేతలను చిత్తుగా ఓడించాలి. వీటికోసం నిజాయతీతో కృషి చేస్తూ ఆచరణలో చూపుతున్న పార్టీలను, నేతలనే గెలిపించాలి. ఈ లక్ష్యాలుగల మంచి రాజకీయం కోసం లోక్‌సత్తా పార్టీ ఎన్నో ఏళ్లుగా పోరాడుతోంది. విరాళంగా తీసుకున్న ప్రతి పైసాకూ రసీదు ఇవ్వటం లేదా చెక్కు రూపంలో తీసుకోవటం చేస్తున్న రాజకీయ పార్టీ భారతదేశం మొత్తం మీద లోక్‌సత్తా మాత్రమే. రాజ్యాంగబద్ధ విలువలకు, చట్టబద్ధపాలనకు కట్టుబడి పార్టీ పోరాడుతోంది. బంగారు లక్ష్మణ్ విషయంలో ఎదురైన అనుభవాన్ని చూశాకైనా మన రాష్ట్రంలోని, దేశంలోని ప్రజలు తమ ప్రయోజనాల పరిరక్షణకు లోక్‌సత్తా పార్టీకి అండగా నిలవాల్సి వుంది. లోక్‌సత్తా పార్టీకే ఓటువేసి ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సి ఉంది. లోక్‌సత్తాను ప్రత్యామ్నాయ రాజకీయానికి వేదికగా ఆంధ్రప్రదేశ్‌తో మొదలుపెట్టి జాతీయస్థాయి పార్టీగా బలోపేతం చేసుకోవాల్సి ఉంది. ◆

**-21వ శతాబ్దపు భారతీయుడు**

## లోక్‌సభ ప్రత్యేకతలు

- **తొలిసభ - 1952-57 - విద్యాధికులే అధికం**
- **మలిసభ - 1957-62 - స్వర్ణయుగం నూతన చట్టాలు**
- **3వ సభ - 1962-67 - చైనాతో యుద్ధం భారత్ ఓటమి**
- **4వ సభ - 1967-70 - కాంగ్రెస్‌లో కుమ్ములాటలు మొదలు**
- **5వ సభ - 1971-77- ఎమర్జన్సీ చీకటి రోజులు**
- **6వ సభ - 1977-79 - తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం**
- **7వ సభ - 1980 -84 - ఇందిర పునరుత్థానం**
- **8వ సభ - 1985-89 - యువసభ. 18 ఏళ్ళకే ఓటు హక్కు**
- **9వ సభ - 1989-91 - కిచిడీ...కలకలం జనతా పార్టీలో చీలికలు**
- **10వ సభ - 1991-96 - తెలుగుతేజం ప్రధానిగా పి.వి**
- **11వ సభ - 1996-97- నేర చరితం ఉధృతం**
- **12వ సభ - 1997-99 - కాషాయం కళకళ**
- **13వ సభ - 1999-2004 - టాడా చట్టం దడ దడ**
- **14వ సభ - 2004-09- సోనియా మాయ**
- **15వ సభ - 2009 - అవినీతి కళంకం**

## మే11, జాతీయ సాంకేతిక పరిజ్ఞాన దినం

# ఎటువంటి టెక్నాలజీ కావాలి ?

సైన్స్ టెక్నాలజీకి సంబంధించి మనదేశంలో రెండు ప్రత్యేకమైన రోజులున్నాయి. సంవత్సరంలో మొదటిది ఫిబ్రవరి 28 నేషనల్ సైన్స్‌డే కాగా, రెండవది మే 11 నేషనల్ టెక్నాలజీ డే. 1988 సి.వి. రామన్ శత జయంతి సందర్భంగా ఈ దేశం తీసుకున్న నిర్ణయం ఏమిటంటే ప్రతి సంవత్సరం రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరించబడిన రోజున నేషనల్ సైన్స్‌డే జరపాలని. 1928 ఫిబ్రవరి 28న సి.వి. రామన్ నోబుల్ బహుమతి సంపాదించిన ఆవిష్కరణను చేశారు. ఆవిష్కరణ జరిగిన రెండేళ్ళకే నోబుల్ బహుమతి రావడం ఆ పరిశోధన గొప్పదనం. ఆ విషయం గమనించకుండా అది సి.వి.రామన్ జన్మదినమని కొందరు ప్రచారం చేస్తుంటారు. అంతకు మించి ఈ తేదీతో సమస్య ఏమిటంటే ఫిబ్రవరి మాసం చివరి రోజు కనుక ఆ రోజున కేంద్ర ప్రభుత్వం సాధారణ బడ్జెట్ ప్రవేశపెడుతుంది. దానికి వారంరోజులు ముందు ఎకనమిక్ సర్వే అని భారీ చర్చలు జరుగుతాయి. 28 తర్వాత బడ్జెట్ గురించి చర్చలు జరుగుతాయి. ఫలితంగా నేషన్‌ల్ సైన్స్ డే తగిన గుర్తింపు సరిగా పొందకుండా సాగిపోతుంది. ఇది నేషనల్ సైన్స్ డే వ్యవహారం.

> **సైన్స్ అనేది సృజన, ప్రతిభ, ఆలోచన కాగా టెక్నాలజీ అనేది నైపుణ్యం, సమన్వయం, సాధన. టెక్నాలజీకి ఉండే సౌలభ్యాల గురించి వివరించినపుడు, దానికుండే పరిమితులూ, అది కలిగించే సమస్యలూ, వాటికి ప్రత్యామ్నాయ మార్గాలనూ తప్పక చర్చించాలి. అదే కాలుష్యం కల్గించని, ఎక్కువ వనరులు వినియోగించుకోని, సమస్యలు సృష్టించని టెక్నాలజీకి దారులు వేయగలదు.**

ఇక నేషనల్ టెక్నాలజీ డే ని మే నెల 11వ తేదీన జరుపుకుంటున్నాం. 1998 మే 11న మూడు వైజ్ఞానిక సంఘటనలు మనదేశంలో జరిగాయి. పోఖ్రాన్-2 అణుపరీక్షలూ, త్రిశూల్ మిస్సైల్ ప్రయోగం, పూర్తి దేశవాళీ పరిజ్ఞానంతో 'హంస-38 ఎయిర్‌క్రాఫ్ట్ విజయం - ఆ మూడు సంఘటనలు! అదే సంవత్సరం మే 25న సి.ఎస్.ఐ.ఆర్. శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డులిస్తూ అప్పటి ప్రధానమంత్రి అటల్‌బిహారీ వాజ్‌పేయి ప్రతి సంవత్సరం మే 11ను జాతీయ సాంకేతిక విజ్ఞాన దినోత్సవంగా జరుపుకుంటామని ప్రకటించారు. జై జవాన్ జై కిసాన్' అనే లాల్ బహదూర్ శాస్త్రి నినాదానికి జై విజ్ఞాన్ కలిపి 'జై జవాన్ జై కిసాన్ జై విజ్ఞాన్' అని కొత్తరూపు ఇచ్చారు. నిజానికి మన టెక్నాలజీ విజయాన్ని గుర్తు చేసుకుంటూ మరింత స్ఫూర్తి పొందడానికి, భవిష్యత్ వ్యూహాలు రచించుకోవడానికి ఈ సందర్భాన్ని వినియోగించుకోవాలి.

ఫిబ్రవరి 28 బడ్జెట్ హడావుడి వల్ల అది కేవలం పాఠశాల, కళాశాల, ప్రయోగశాలల వ్యవహారంగా మారిపోయింది. సభలు, ప్రసంగాలు చర్చలు ఆ స్థాయిలో జరుగుతాయి. మీడియాకు ఇది పెద్దగా ఆసక్తి కల్గిందని విషయంగా మిగిలిపోతోంది. ఇక టెక్నాలజీ డే మే 11 కావడంతో ఆ సమయంలో విద్యాసంస్థలన్నీ పరీక్షల సందోహంలో మునిగి వుంటాయి.

వాస్తవానికి సైన్స్‌డేను విద్యాసంస్థలూ, ప్రయోగశాలలూ పెద్దఎత్తున కార్యక్రమాలు జరిపితే, టెక్నాలజీ డే ను పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు ఇంకా పెద్ద ఎత్తున చేపట్టాలి. సైన్స్ వల్ల తక్షణం ప్రయోజనం ఉండకపోవచ్చు కానీ, టెక్నాలజీ వల్ల మొత్తం పారిశ్రామిక, వాణిజ్య రంగాలు నడుస్తున్నాయి. అందువల్ల ఈ రెండు రంగాలు టెక్నాలజీ ప్రాచుర్యం కోసం, పరిశోధన కోసం నడుం కట్టాలి. కానీ అలాంటి వాతావరణం మన దేశంలో కనబడటం లేదు. ప్రభుత్వం విడుదల చేసే ప్రకటనలు తప్పించి మరే సామాగ్రి మీడియాలో కనబడదు. టెక్నాలజీని వినియోగించుకునే వర్గాలు ఎంతో కొంత టెక్నాలజీ కోసం వ్యయం చేయాలి.

సైన్స్ అనేది సృజన, ప్రతిభ, ఆలోచన కాగా, టెక్నాలజీ అనేది నైపుణ్యం, సమన్వయం, సాధన! అందుకే ఎ.పి.జె. అబ్దుల్ కలాం సైన్స్ అనేది వైయక్తికమైతే, టెక్నాలజీ సామూహిక ప్రయత్నమని వివరిస్తారు. టెక్నాలజీ అనేది అవసరాలను తీర్చే అనువర్తనం. దీనివల్ల మానవ శ్రమ తగ్గుతుంది. మరింత ఎక్కువ పని, మరింత శీఘ్రుంగా, నైపుణ్యంతో చేయగలం. అంతేకాదు మనిషి సుఖాన్ని, సంతోషాన్ని పెంచగలం. చక్రాన్ని సాంకేతిక విజ్ఞానానికి ఒక ప్రతీకగా పరిగణిస్తాం. తొలుత చక్రం రాకతో

మనిషి పని సులువు అయిందని మనకు తెలుసు. అలా మొదలైన సాంకేతిక విజ్ఞానం ప్రగతి నేడు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, నానో టెక్నాలజీ, బయో టెక్నాలజీ, రాకెట్లు, ఉపగ్రహాలు, విస్సెల్, మరోవైపు ఇంకెన్నో అణ్వాయుధాలు అనే రీతిలో సాగుతోంది.

ఆహారభద్రతకు, ఆరోగ్యభద్రతకు టెక్నాలజీ చేసిన దోహదం ఇంతని చెప్పలేం. పెరిగే జనాభా, పెరగని ప్రకృతి వనరులు! ఈ నేపథ్యంలో ఆహార ఉత్పత్తి కేవలం టెక్నాలజీ కారణంగా పెరిగింది. ఇది వ్యవసాయ రంగంలో ప్రగతి. మనిషి సగటు ఆయుర్దాయం పెంచగలిగింది-వైద్యరంగంలోని టెక్నాలజీ. ఈ రెండింటి తర్వాత పారిశ్రామిక రంగంలో రక్షణ రంగంలో టెక్నాలజీ కీలకమైంది. పారిశ్రామిక ఉత్పత్తి ఆర్థికపరమైన వెసులుబాటుకు దారితీస్తే, రక్షణ రంగంలోని టెక్నాలజీ మనకు భయాన్ని పోగొట్టి, భద్రతా భావాన్ని కలిగిస్తుంది. ఈ రెండు సామర్థ్యాల ద్వారా ఇతర దేశాలను నియంత్రించాలనే ఆలోచన ప్రపంచ రాజకీయాలను నడిపిస్తోంది. అది వేరే విషయం. అలాగే వాణిజ్య వర్గాల దురన్యాయాలు కూడా చర్చనీయాంశాలే! టెక్నాలజీకి సంబంధించి పెద్ద విమర్శ ఏమిటంటే సహజ (ప్రకృతి) వనరులను త్వరత్వరగా వినియోగించి; ప్రకృతికి సహకరించిన వస్తువుల ఉత్పత్తిని పెంచడం, ఇది ఒక సమస్య కాగా, టెక్నాలజీ కారణంగా కాలుష్యం విపరీతంగా పెరగడం మరో పెద్ద అవరోధం. నిజానికి ఈ రెండు సమస్యలను సరిగా గమనించకుండా సాంకేతిక ఆవిష్కరణలు ప్రాచుర్యం పొందాయి. ఈ రెండింటికి ఎలా కళ్ళెం వేయాలో తెలియకుండా ప్రపంచం ఇబ్బందిపడుతోంది.

టెక్నాలజీకి ఉండే సౌలభ్యాల గురించి వివరించినపుడు, దానికుండే పరిమితులూ, అది కలిగించే సమస్యలూ; వాటిని ప్రత్యామ్నాయ మార్గాలూ – గురించి కూడా తప్పక చర్చించాలి. అదే కాలుష్యం కల్గించని, ఎక్కువ వనరులు వినియోగించుకోని, సమస్యలు సృష్టించని టెక్నాలజీకి దారులు వేయగలదు. ◆

**–డా॥ నాగసూచి వేణుగోపాల్**

(సాక్షి సౌజన్యం....)

---

# 'బాబు సీసాలో కిరణ్ సారా'

## మద్యంపై చంద్రబాబు విధానాన్ని అనుసరించవద్దు

### మద్యం విధానంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించండి - ముఖ్యమంత్రికి లోక్‌సత్తా లేఖ

రాష్ట్రంలో 2004 వరకు అమలులో వున్న లాటరీ పద్ధతిలోనే మద్యం దుకాణాలను కేటాయించే మద్యం విధానాన్ని జులై 1, 2012 నుంచి అమలు చేయాలని ఎక్సైజ్ విధానంపై సమీక్ష జరిపిన అధ్యయన బృందం చేసిన సిఫార్సు కొండను తవ్వి ఎలకను పట్టినట్టుందని లోక్‌సత్తా పార్టీ పేర్కొంది. నూతన మద్యం విధానాన్ని రూపొందించటానికి ముందే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మ మే 15, 2012న ముఖ్యమంత్రి ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డికి లేఖ రాశారు.

"నూతన మద్యం విధానం రూపొందించటానికి ప్రభుత్వం వివిధ రాష్ట్రాలలో వున్న పద్ధతులను పరిగణలోకి తీసుకోవటం చూసి కఠిన మద్యనియంత్రణకు దోహదం చేసే కొత్త విధానం రూపొందుతుందని ఆశించాం. కానీ మీడియాలో వస్తున్న వార్తల ప్రకారం అధ్యయన బృందం చేసిన సిఫార్సు కొండను తవ్వి ఎలకను పట్టినట్టుగా ఉంది. ఢిల్లీ, తమిళనాడులలో నేరుగా ప్రభుత్వమే మద్యం వ్యాపారాన్ని నిర్వహిస్తూ విచ్చలవిడి మద్యం దుష్ఫలితాలకు అవకాశంలేకుండా చేస్తున్న విషయం తెలిసికూడా దానిని అనుసరించకుండా... 2004కు ముందు చంద్రబాబు ప్రభుత్వం అనుసరించిన లైసెన్సు, లాటరీ పద్ధతిని తెచ్చి ఆ పాత సారాని కొత్త విధానంగా తేవాలన్న ప్రయత్నం మీ ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచేది కాబోదు. సత్ఫలితాలను ఇచ్చేది కాదు" అని వర్మ సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

లాటరీ పద్ధతిలో కూడా రిటైల్ మద్యం వ్యాపారాన్ని ప్రయివేటు వ్యక్తులే నిర్వహిస్తారుగనుక విధిగా లాభాపేక్ష కోణం, సిండికేట్లు ఏర్పడే అవకాశం ఉంటుందని, అందువల్ల ప్రజాప్రయోజనాలకు హాని జరుగుతుందని వర్మ స్పష్టంచేశారు.

**మద్యం రిటైల్ వ్యాపారాన్ని ప్రభుత్వమే చేపట్టి, పరిమితంగా, పరిమిత వేళల్లో, పరిమిత రోజులలో నిర్వహించాలని లోక్‌సత్తా పార్టీ తొలినుంచీ కోరుతోందని,** ఈవేళ దాదాపు అన్ని రాజకీయ పార్టీలూ అదే డిమాండ్‌ను చేస్తున్నాయని, కాబట్టి ఈ అంశంపై తక్షణం అఖిలపక్ష సమావేశం నిర్వహించి, ఏకాభిప్రాయంతోనే మద్యం విధానాన్ని ప్రకటించాలని డి.వి.వి.ఎస్ వర్మ ముఖ్యమంత్రిని కోరారు.

# వ్యవసాయరంగ విముక్తికి తక్షణం సంస్కరణలు చేపట్టండి

## ప్రధానికి జయప్రకాష్ నారాయణ్ లేఖ

లైసెన్స్–పర్మిట్–కంట్రోల్–కోటా రాజ్యం నుంచి ఆర్థికవ్యవస్థలోని మిగిలినరంగాలను విముక్తి చేసినట్టే వ్యవసాయరంగాన్ని కూడా విముక్తి చేసే సంస్కరణల్ని వెంటనే చేపట్టాలని, వ్యవసాయోత్పత్తుల ఎగుమతులకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని, వ్యవసాయరంగంలోని సవాళ్లను ఎదుర్కొనేందుకు–అవకాశాల్ని వినియోగించుకునేందుకు సమగ్రవిధానం చేపట్టాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు, స్వతంత్ర రైతుసంఘాల అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రధానమంత్రి డా॥ మన్మోహన్ సింగ్‌కు లేఖరాశారు.

వ్యవసాయోత్పత్తుల ఎగుమతులపై వ్యవసాయం, ఆహారశాఖ మంత్రుల మధ్య అభిప్రాయా భేదాలను పరిష్కరించటానికి ఏప్రిల్ నెలాఖరులో ప్రధానమంత్రి ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేస్తున్న సందర్భంగా పీఎంకు జయప్రకాష్ నారాయణ్ ఏప్రిల్ 26, 2012న ఈ లేఖ రాశారు. **ఈ లేఖలోని సూచనలను కూడా పరిగణలోకి తీసుకుని కేంద్రప్రభుత్వం వ్యవసాయోత్పత్తుల ఎగుమతుల్ని పెంచే దిశగా ఆ సమావేశంలో పలుకీలక నిర్ణయాలు తీసుకుంది. చక్కెర ఎగుమతులపై పరిమితులను, పత్తి ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేసింది. ఉల్లిపాయల ఎగుమతికి కనీసధర షరతును ఎత్తివేయటానికి అంగీకరించింది. మిగులు ఆహారోత్పత్తుల ఎగుమతులపై విధాన నిర్ణయం తీసుకునేందుకు నిపుణుల కమిటీని నియమించాలని నిర్ణయించింది.**

ఇటీవలి కాలంలో వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఒకపక్క పెట్టుబడి వ్యయం, కూలీల ఖర్చు బాగా పెరుగుతుంటే మరోపక్క వ్యవసాయోత్పత్తులకు ధరలు మాత్రం బాగా తగ్గిపోతున్నాయని జేపీ తన లేఖలో ప్రధాని దృష్టికి తెచ్చారు. చేశారు. ప్రభుత్వం అనుసరిస్తున్న నిలకడలేని, తాత్కాలిక విధానాల వల్ల సంక్షోభం మరింత తీవ్రతరమవుతోందని, ఎరువుల వంటి ఇన్‌పుట్‌లపై నియంత్రణల్ని నెమ్మదిగా ఎత్తివేయటం వల్ల ధరలు పెరుగుతుంటే, వ్యవసాయోత్పత్తులపై పెరుగుతున్న నియంత్రణలు ఆహారధాన్యాల ధరల్ని మరింత దెబ్బతీస్తున్నాయన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయరంగానికి జరుగుతున్న తీవ్రనష్టానికి ఉదాహరణగా ధాన్యం, పత్తి, వంటనూనె పంటల గురించి ప్రధానికి జేపీ వివరించారు.

### జూన్ 2012 నాటికి భారత్‌లో రికార్డుస్థాయిలో 7.5 కోట్ల టన్నులకు ఆహార ధాన్యాల నిల్వలు




దేశ చరిత్రలోనే రికార్డుస్థాయిలో 2012 జూన్ నాటికి ఆహార ధాన్యాల నిల్వలు భారత్‌లో 7.5 కోట్ల టన్నులకు చేరుతున్నాయి. ఇందులో మూడోవంతు ఆరుబైటే టార్పాలిన్ కింద వుంటాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే అక్టోబర్ నుంచి మార్కెట్‌లోకి ప్రవేశించే బియ్యాన్ని నిల్వ చేసుకోవటానికి కూడా స్థలం వుండదు. రైతులకు న్యాయమైన రేటు అలా వుంచి, కనీస ధర కూడా లభించని దుర్భర పరిస్థితి ఏర్పడుతుంది. ఇన్‌పుట్ సబ్సిడీలు, వడ్డీ మాఫీ వంటి చిన్న చిన్న అంశాలకే పరిమితమవుతూ రైతుల ఓట్లు కొల్లగొట్టడానికి ప్రయత్నిస్తున్న ప్రభుత్వాలకు, పార్టీలకు వ్యవసాయరంగ సంక్షోభం, మౌలిక సంస్కరణలు పట్టడం లేదు. ఎగుమతులకు శాశ్వత ఏర్పాట్లు చేసి వ్యవసాయరంగాన్ని ఆంక్షల నుంచి విముక్తి చేసి రైతుకి లాభసాటి ధర తెచ్చే మార్పుకోసం లోక్‌సత్తా తప్ప ఏ పార్టీ పోరాడటం లేదు.

దేశ ఆహార అవసరానికి మించి ఆహారధాన్యాలు ఎఫ్.సి.ఐ గోదాముల్లో పొంగిపొర్లుతున్నా, నిల్వకు సరైన ఏర్పాట్లు లేక టార్పాలిన్ కప్పి ఆరుబైటే ధాన్యాల్ని ఉంచటం వల్ల ఎండకు ఎండి వానకు తడిసి కుళ్లిపోతున్నా భారత ప్రభుత్వం ఎగుమతులకు శాశ్వత ప్రాతిపదికన విధానాలను అమలుచేయకపోవటం రైతులను దెబ్బతీస్తోందని జేపీ అన్నారు.

"దేశంలో ఒకపక్క ఆహారధాన్యాల ఉత్పత్తి క్రమంగా పెరుగుతుంటే, మరోపక్క పండ్లు, కూరగాయలు, గుడ్లు, మాంసం, పాలు వంటి వాటికి ప్రజలు మళ్లుతుండటం వల్ల ఆహారధాన్యాల తలసరి వినియోగం తగ్గిపోతోంది. చాలాచోట్ల ప్రజాపంపిణీ వ్యవస్థ కోసం కేటాయించిన ఆహారధాన్యాలు రీసైకిల్ అవుతున్నాయి. తిరిగి వాటిని 'లెవీ'గా ఎఫ్.సి.ఐ కొనుగోలు చేస్తోంది. ఇలాంటి పరిస్థితులలో బియ్యం ఎగుమతికి 2011లో ప్రధాని జోక్యంతో అనుమతించినా, ఎగుమతుల కోటాపై ఏకపక్ష నిర్ణయాలు, వారానికోసారి నిర్ణయం వెనక్కి తీసుకుంటుండటం వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ బియ్యానికి థాయ్‌లాండ్ బియ్యంకంటే తక్కువ ధర పలుకుతోంది. ఎగుమతిదారులు కూడా రిస్కులు తీసుకోవటానికి, దీర్ఘకాలిక మార్కెట్ సంబంధాలు ఏర్పరుచుకోవటానికి ముందుకు రావటం లేదు. ఆంధ్రప్రదేశ్‌లాంటి రాష్ట్రాలలో ఆహారధాన్యాల్ని రాష్ట్ర సరిహద్దు దాటించి పక్క రాష్ట్రంలో కూడా అమ్మకుండా చట్టవిరుద్ధంగా నిషేధించటం వల్ల రైతులకు మరింత నష్టం జరుగుతోంది" అని జేపీ పేర్కొన్నారు.

అలాగే పత్తికి ఈ ఏడాది కూడా రికార్డు ఉత్పత్తి ఉన్నా ప్రభుత్వ నిలకడలేని విధానం వల్ల ప్రస్తుతం రైతుకి క్వింటాలుకి రూ.4,000లోపు మాత్రమే ధర లభిస్తోందన్నారు. రికార్డుస్థాయి ఉత్పత్తిని సాధించినా లాభాలు ఆర్జించలేకపోవటం పత్తి రైతును కుంగదీస్తోందని, గత కొన్నేళ్లుగా అత్యధికంగా ఆత్మహత్యలకు పాల్పడింది పత్తిరైతులేనని ప్రధానికి జేపీ గుర్తుచేశారు. భారత వస్త్రపరిశ్రమకు ముడిసరకు కావాలన్న నెపంతో పత్తి ఎగుమతులపై పరిమితి విధించటం, ఎగుమతుల్ని నిలిపివేయటం వంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రైతులకు మంచి ధర కావాలి తప్ప భారతీయులకు అమ్మామా, విదేశీయులకు అమ్మామా అన్నది ముఖ్యం కాదని, స్వదేశంలో కొరత ఏర్పడితే పత్తి రైతుకు మంచి ధర ఇచ్చి ఉత్పత్తిని మరింత పెంచేలా ప్రోత్సహించాలి తప్ప లైసెన్స్-కోటా రాజ్యాన్ని తిరిగి తీసుకురావటం సరైన విధానం కాదని జేపీ స్పష్టంచేశారు.

భారతదేశం చాలామేరకు దిగుమతులపై ఆధారపడిన వంటనూనెల విషయంలో, దిగుమతులపై కనీస సుంకం విధించటం లేదని, వంటనూనెల సాగులో స్వావలంబన సాధించేందుకు పెద్దఎత్తున కృషి జరగటం లేదని జేపీ అన్నారు. వంటనూనెల దిగుమతులపై భారత్ ఆధారపడివుందని గ్రహించిన ఎగుమతిదారు దేశాలు మాత్రం తమ ఎగుమతులపై పన్ను విధించి లాభపడుతున్నాయన్నారు. వంటనూనెల దిగుమతులపై కనీసం 10శాతం సుంకం విధించి ఆ డబ్బును రైతులకిచ్చి నూనెగింజల ఉత్పత్తికి ప్రోత్సహించాలన్నారు.

ప్రభుత్వం అనుసరిస్తున్న తాత్కాలిక విధానాలు, బూజుపట్టిన విధానాలు వల్ల వ్యవసాయోత్పత్తుల ధరలు నానాటికీ దిగజారుతూ రైతులు ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో పంటవిరామం ప్రకటిస్తున్నారని, ఆదాయం కోసం ఒక పంట నుంచి మరోపంటకు మారుతూ ధరలలో మరింత ఒడిదుడుకులకు కారణమవుతున్నారన్నారు. ఇది ఆర్థికవ్యవస్థకు దీర్ఘకాలిక ప్రమాదంగా పరిణమిస్తుందని జేపీ హెచ్చరించారు.

వ్యవసాయ సంక్షోభం గ్రామీణ ప్రాంతాలలో తీవ్ర అలజడికి దారి తీయకముందే ప్రభుత్వం విజ్ఞతతో, వేగంగా వ్యవహరించాలని, వ్యవసాయరంగాన్ని బాగుచేసేందుకు ఈ దిగువ చర్యల్ని తీసుకోవాలని జయప్రకాష్ నారాయణ్ ప్రధానిని కోరారు...

"1. వ్యవసాయోత్పత్తుల వాణిజ్యాన్ని పూర్తిస్థాయిలో, నిర్ద్వంద్వంగా నిబంధనల చట్రం నుంచి విముక్తి చేసి పూర్తి స్వేచ్ఛ కల్పించాలి. దీనివల్ల మార్కెట్‌లు ఇచ్చే గరిష్ఠ ధర రైతులకు లభిస్తుంది, ధరలు బాగా కనిపిస్తుంటే దీర్ఘకాలిక ఉత్పత్తి పెరుగుతుంది.

2. భారతదేశ పరిశ్రమల, వినియోగదారుల అవసరాలు మరింత ధరల మెరుగైన ధరలను రైతులకివ్వటం వల్ల నెరవేరతాయి తప్ప రైతులకు ధరల్నివ్వకుండా అణచివేయటం వల్ల కాదు. రైతులను అణగదొక్కటం వల్ల మధ్యకాలిక, దీర్ఘకాలిక కొరతలు ఏర్పడి, ధరలు పెరగటం అనివార్యమవుతుంది.

3. నిల్వ, సరఫరా గొలుసు, ఆగ్రో ప్రాసెసింగ్‌లోకి పెద్దఎత్తున పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకురావాలి

4. వ్యవసాయ దిగుమతులపై కనీసస్థాయి దిగుమతి సుంకాన్నయినా విధించాలి. ముఖ్యంగా వంటనూనెల దిగుమతులపై. ఆ సుంకం ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఉత్పత్తి పెంచటానికి ప్రోత్సాహకంగా ఇచ్చి లోటును తొలగించేందుకు ప్రయత్నించాలి.

5. వాటితోపాటు, ఆర్థిక స్వేచ్ఛ రైతులకు సంతృప్తికర ఫలితాలనిచ్చేదాకా కనీస మద్దతు ధర (ఎం.ఎస్.పి)ని రక్షణ కవచంగా కొనసాగించాలి.

6. వ్యవసాయంలో మనకున్న బలాల్ని (ప్రపంచంలోని వ్యవసాయభూమిలో 11శాతం ఉండటం, సూర్యరశ్మి, మంచి వర్షపాతం, బలమైన వ్యవసాయ సంస్కృతి) వినియోగించుకుని అభివృద్ధికి చోదకశక్తిగా, ఎగుమతుల ద్వారా ఆదాయాన్నిచ్చేదిగా వ్యవసాయరంగాన్ని తీర్చిదిద్దాలి.” ◆

# ఎరువుల వినియోగం ఎక్కువ...దిగుబడి తక్కువ

## ‘రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రం - 2012’ వెల్లడి

తలసరి ఆదాయంలో దేశంలోని 15 ప్రధాన రాష్ట్రాలతో ముందు వరసలో నిలిచిన రాష్ట్రం.. శిశుమరణాల్లో బీహార్‌లాంటి వెనకబడిన రాష్ట్రాలతో పోటీపడింది. రసాయన ఎరువుల వినియోగంలో ముందున్న మనం... ఆహారధాన్యాల ఉత్పత్తిలో మిగతా రాష్ట్రాల కంటే వెనుకబడ్డాం. తలసరి బ్యాంకు డిపాజిట్ల కంటే తలసరి బ్యాంకు రుణాలే మన రాష్ట్రంలో ఎక్కువ. ఒక తమిళనాడు మినహా మిగతా రాష్ట్రాల్లో బ్యాంకు రుణాల కంటే బ్యాంకుల్లో ఉన్న తలసరి డిపాజిట్లే ఎక్కువ. ‘రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రం–2012’ను అర్థగణాంక శాఖ ఇటీవల విడుదల చేసింది. వివిధ సూచీలను 15 రాష్ట్రాలతో పోల్చింది.

**ముఖ్యాంశాలు ఇవీ....**

★ తలసరి ఆదాయంలో హర్యానాది తొలిస్థానం. మహారాష్ట్ర కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తర్వాత స్థానాల్లో నిలిచాయి. 15 రాష్ట్రాల సగటు తలసరి ఆదాయం కంటే తొమ్మిది రాష్ట్రాల్లో తలసరి ఆదాయం ఎక్కువ.

★ తలసరి బ్యాంకు డిపాజిట్ల కంటే బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు మన రాష్ట్రంతో పాటు తమిళనాడులో ఎక్కువ. రూ. 1.31 లక్షలతో తలసరి బ్యాంకు డిపాజిట్లు, 1.06 లక్షల రుణాలతో మహారాష్ట్ర అగ్రస్థానంలో నిలిచింది. 15 రాష్ట్రాల సగటు బ్యాంకు డిపాజిట్ల కంటే మన రాష్ట్రంలో తలసరి డిపాజిట్ మొత్తం తక్కువ. కానీ రుణాల విషయంలోనూ 15 రాష్ట్రాల సగటు కంటే ఎక్కువే.

★ శిశుమరణాల్లో 6.2 శాతంతో మధ్యప్రదేశ్ తొలిస్థానంలో నిలిచింది. ఒడిశా, ఉత్తరప్రదేశ్, అస్సాం, రాజస్థాన్, బీహార్, ఆంధ్రప్రదేశ్ తర్వాత స్థానాల్లో నిలిచాయి. దక్షిణాది రాష్ట్రాలతో.. పోలిస్తే... మన రాష్ట్రంలోనే శిశుమరణాలు అధికం. అతి తక్కువ శిశుమరణాలు కేరళలో (1.3 శాతం) నమోదయ్యాయి.

★ రసాయన ఎరువుల వినియోగంలో పంజాబ్ నంబర్ వన్. హెక్టార్‌కు ఒక్కో పంటకు 237.05 కిల్లో ఎరువులను పంజాబ్ రైతులు వినియోగిస్తుండగా... 225.65 కిలోల వినియోగంతో మన రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. 209.92 కేజీలతో హర్యానా మూడోస్థానంలో ఉంది. 15 రాష్ట్రాల సగటు రసాయన ఎరువుల వినియోగం 135.76 కిలోలే.

★ రసాయన ఎరువుల వినియోగంతో పాటు.. హెక్టారుకు సగటు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో పంజాబ్‌దే తొలి స్థానం. మన రాష్ట్రంతో పోలిస్తే... దాదాపు రెట్టింపు దిగుబడిని పంజాబ్ రైతులు సాధిస్తున్నారు. హర్యానా, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తర్వాత స్థానాల్లో నిలిచాయి. 15 రాష్ట్రాల సరాసరి కంటే తక్కువ ఎరువులు వినియోగిస్తున్న కేరళ దిగుబడిలో నాలుగోస్థానంలో నిలిచింది. ఎరువుల వినియోగంతో పాటు దిగుబడిలోనూ రాజస్థాన్ ఆఖరుస్థానంలో నిలిచింది. రసాయన ఎరువులపై మన రైతులు భారీగా ఖర్చు పెడుతున్నా దిగుబడిలో మాత్రం మిగతా రాష్ట్రాలకంటే వెనుకబడి ఉన్నారు.

★ సగటు విద్యుత్ వినియోగంలో పంజాబ్ మొదటి స్థానంలో నిలిచింది. గుజరాత్, హర్యానా, తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తర్వాత స్థానాల్లో నిలిచాయి. ◆

# పెరుగుతున్న బెల్టుషాపులలో స్వాధీనం చేసుకున్న మద్యం

రాష్ట్రంలో మద్యం బెల్టుదుకాణాలను చంద్రబాబు నాయుడు హయాంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రారంభిస్తే, వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం ఏర్పడ్డాక 2004 నుంచి ఆ బెల్టుషాపులు విచ్చలవిడిగా మారిపోయి రాష్ట్రంలోని పల్లెపల్లెకూ విస్తరించాయనేది నిరూపించనక్కర్లేని సత్యం. అధికారంలోకి వచ్చాక మద్యం వినియోగాన్ని క్రమంగా నిరుత్సాహపరుస్తూ మద్యనిషేధం సాధించే దిశగా కృషి చేస్తామని 2004 ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తర్వాత అందుకు పూర్తివిరుద్ధంగా వ్యవహరించి ప్రజల్ని వంచించింది.

పైకి సంక్షేమం అంటూ నాటకమాడుతూ, ప్రజల్ని బిచ్చగాళ్లుగా కొనసాగించే ఎత్తుగడలకు తేనె పూసి కొన్ని పథకాలను ప్రారంభించి మళ్లీ వాటికయ్యే ఖర్చును కూడా మద్యం నుంచే పిండి అన్నిరకాలుగా వైఎస్ ప్రభుత్వం ప్రజలకు ద్రోహం చేసింది. పైకి మాత్రం అసలు బెల్టుషాపులే లేవని వైఎస్ రాజశేఖర రెడ్డి స్వయంగా అసెంబ్లీలో బుకాయించారు. అయితే వైఎస్ ప్రభుత్వం మెడలు వంచి బెల్టుషాపులు వున్నాయి, మూయించేందుకు ప్రయత్నిస్తాం అని ఒప్పుకునేలా చేసింది లోక్‌సత్తా పార్టీ. ఆగస్టు 15, 2007న శ్రీకాకుళం నుంచి మొదలుపెట్టి లోక్‌సత్తా, మహిళాసత్తా కార్యకర్తలు 45 రోజుల పాటు బెల్టుషాపులకు వ్యతిరేకంగా, కఠిన మద్యనియంత్రణను డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేశారు. ఆ పర్యటనలో సేకరించిన బెల్టుషాపుల వివరాలను, మద్యం వల్ల నష్టపోతున్న పేదకుటుంబాల దయనీయ గాథల వివరాలను ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డికి అందించింది. మొదట బుకాయించినా చివరకు అన్ని సాక్ష్యాలతో అక్టోబర్ 5, 2007న తనను కలిసిన లోక్‌సత్తా, మహిళాసత్తా నేతల ముందు వైఎస్ తలవంచారు. బెల్టుషాపులు ఉన్నాయి, వాటిని మూయించాలని పోలీసులకు ఆదేశిస్తున్నా, మీ వద్దనున్న వివరాలు పోలీసులకు ఇవ్వండి అని హామీ ఇవ్వాల్సి వచ్చింది.

**బెల్టుషాపుల్ని శాశ్వతంగా మూసివేయాలంటే కేవలం వాటి మీద అడపాదడపా దాడులు సరిపోవని, మద్యం వేలం విధానాన్ని మార్చటం, వాటిని మూసివేసే అధికారాల్ని స్థానికంగా పంచాయతీలకు/గ్రామసభలకు అప్పచెప్పటమే అందుకు పరిష్కారమని లోక్‌సత్తా పార్టీ తొలినుంచీ స్పష్టంచేస్తోంది.** 2010లో జరిగిన మద్యం వేలంపాటలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేసింది లోక్‌సత్తా పార్టీ మాత్రమే. అటు పేదప్రజల జీవితాల్ని, ఇటు రాజకీయాల్ని ఆ విధానం నాశనం చేస్తోందని ఇటీవలి ఏసీబీ దాడులలో కూడా అనేక ఉదాహరణలు బైటపడ్డాయి.

మద్యం విధానాన్ని మార్చకపోవటం, బెల్టుషాపుల్ని మూసివేసే అధికారాల్ని పంచాయతీలకు ఇవ్వకపోవటం వల్ల బెల్టుషాపులు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతూనే ఉన్నాయి. రాజకీయ ఒత్తిడితో అడపాదడపా వాటిపై దాడులు జరుపుతున్నా, సిబ్బంది కొరత, ప్రభుత్వం మద్యాన్ని ఆదాయమార్గంగానే చూస్తుండటం వల్ల బెల్టుషాపులు మూత పడటం లేదు. **తాజాగా బెల్టుషాపుల నుంచి స్వాధీనం చేసుకుంటున్న మద్యం పరిమాణం ఆ వాదనలు సత్యమని రుజువు చేస్తున్నాయి. 2011-12 ఆర్థికసంవత్సరంలో బెల్టుషాపుల నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం పరిమాణం అంతకుముందు ఏడాదికంటే రెట్టింపుగా నమోదైంది. 2011-12లో 15,396 మద్యం బెల్టుషాపులపై దాడులు చేసి 1,28,590 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.** అంతకుముందు ఏడాది 2010-11లో 15,370 కేసులలో 85,962 లీటర్ల మద్యాన్ని మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. ఇంకా చాలా బెల్టుషాపులను తాము పట్టుకోలేకపోతున్నామని, దానికి ప్రధాన కారణం తగినంత సిబ్బందిలేకపోవటం, చూసీచూడనట్టు వదిలేయమని ప్రభుత్వమే కోరటమని ఎక్సైజ్ సిబ్బంది చెబుతున్నారు. బెల్టుషాపులు సుంకం చెల్లించని మద్యం కలిపిచూస్తే రాష్ట్రాన్ని మద్యం ద్వారా నాశనం చేస్తున్న తీరు కలచివేస్తుంది. ప్రభుత్వమే పరిమితంగా, పరిమితవేళల్లో, పరిమితరోజులలో మద్యం రిటైల్ వ్యాపారాన్ని చేపట్టి మద్యాన్ని కఠినంగా నియంత్రించే విధానాన్ని జులై 1 నుంచి రాబోయే ఎక్సైజ్ సంవత్సరం నుంచైనా అమలు చేయాలి.

**బెల్టుషాపుల నియంత్రణాధికారాన్ని పంచాయతీలకు ఇవ్వాలి. అక్కడ తప్పుజరిగితే ఆ పంచాయతీలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. ఈ దిశగా నూతన ఎక్సైజ్ విధానాన్ని సాధించుకోవటానికి, మద్యం రాజకీయాల్ని రాష్ట్రం నుంచి పారదోలటానికి ప్రజలు సంఘటితం కావాలి. ఓటు ద్వారాసాంప్రదాయ రాజకీయ (సా.రా) పార్టీలను చిత్తుగా ఓడిస్తేనే అది సాధ్యమవుతుంది.** ◆

# పత్రికా స్వేచ్ఛకు భంగం కాదు : జేపీ

## జగతి పబ్లికేషన్స్ అకౌంట్స్ సీజ్ వ్యవహారం

సాక్షి పత్రిక ఖాతాలను సీబీఐ స్తంభింపజేయడాన్ని ప్రతికా స్వేచ్ఛకు భంగంగా భావించలేమని, లోక్‌సత్తా పార్టీ అధినేత జయప్రకాష్ నారాయణ్ స్పష్టం చేశారు. 'పత్రికా స్వేచ్ఛ వేరు, వృత్తిపరంగా, వ్యాపారపరంగా లభించే స్వేచ్ఛ వేరు. ఆ రెండింటినీ కలిపి చూడకూడదు. పత్రిక కూడా వ్యాపార సంస్థ కాబట్టి వ్యాపారపరంగా దానిపై ఆంక్షలు, నియంత్రణలు పెడితే, దాన్ని పత్రికపై నియంత్రణలుగా అనుకుంటున్నాం. అది తప్పు' అని ఆయన పేర్కొన్నారు. 'భూముల కేటాయింపుల్లో అక్రమాలపై గతంలో శాసనసభలో చర్చ జరిగినపుడు ప్రభుత్వంలో కీలకమైన స్థానంలో ఉన్నవారు అధికార దుర్వినియోగంతో తీసుకున్న నిర్ణయాల వల్ల ఎన్ని వందల కోట్ల రూపాయలు పెట్టుబడుల రూపంలో వారి కుటుంబ సభ్యుల సంస్థలోకి వచ్చాయో సోదాహరణంగా వివరించాను. వారి సంస్థలో అవకతవకల్ని ఆదాయపు పన్ను శాఖ అధికారులు గుర్తించినపుడు, అది బ్లాక్‌మనీ కాదని గానీ, అక్రమంగా రాలేదని గానీ అనలేదు. అవినీతి అంత పెద్ద ఎత్తున జరిగాక, ఆ డబ్బును స్తంభింపజేస్తే దాన్ని పత్రికా స్వేచ్ఛ అంటే ఎలా? అని నిలదీశారు.

### నిబద్ధత గల శక్తులు ఏకం కావాలి

దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పటి వరకు పాతుకుపోయిన పార్టీలను ఇంటికి పంపాలన్న విపరీతమైన కసి, కోపం ప్రజల్లో ఉన్నాయని జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. అదే సమయంలో ఎలాంటి ప్రత్నామ్నాయం కావాలో నిర్ణయించుకునే పరిణతి ప్రజల్లో ఇంకా రాలేదన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా జగన్‌కి ఎన్ని సీట్లు వస్తాయన్న చర్చే జరుగుతోంది. కాంగ్రెస్, తెదేపా, భాజపా... పార్టీలు ఏమైనా కావొచ్చు. అవన్నీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయి. రాజకీయాన్ని వ్యాపారంగా మార్చేశాయి. డబ్బు సంచులకు, గూండాలకు, కులం పేరుతో ప్రజల్ని చీల్చేవారికి, అవినీతికి పాల్పడేవారికి, నాయకుల కొడుకులు, కుమార్తెలకే తప్ప మరెవరికీ అవకాశం లేకుండా రాజకీయాన్ని నాశనం చేశాయి. ఈ పార్టీలు ఏ సంప్రదాయ రాజకీయ మూసలో ఉన్నాయో దాన్ని తరిమికొట్టే తరుణం ఆసన్నమైంది. అయితే ఆ పార్టీల్ని పాతిపెట్టే క్రమంలో వాటికి ఏమీ తీసిపోని, అదే మూసలో ఉన్న వైకాపా వైపు ప్రజలు చూస్తున్నారు. అది ప్రమాదకరం' అని ఆయన పేర్కొన్నారు. అందుకే ప్రజలకు మెరుగైన ప్రత్యామ్నాయం అందించేందుకు వామపక్షాలతో లోక్‌సత్తా జత కడుతోందని తెలిపారు. సీపీఐ తాత్కాలికంగా తన పంథాలో వెళుతోంది. సీపీఎం మాతో కలిసి వచ్చింది అని తెలిపారు. ఈ ఉప ఎన్నికల్లో లోక్‌సత్తా అయిదు స్థానాల్లో పోటీ చేస్తోందని చెప్పారు. ◆

**వివిధ అంశాల్లో మన స్థానమెక్కడంటే.....**

| రాష్ట్రం | తలసరి ఆదాయం (2009-10 గణాంకాల ఆధారంగా) | తలసరి బ్యాంకు డిపాజిట్లు | తలసరి బ్యాంకు రుణాలు (2011 లెక్కల ప్రకారం) | శిశుమరణాల శాతం |
|---|---|---|---|---|
| 1. ఆంధ్రప్రదేశ్ | 51,025 | 34,512 | 37,958 | 4.6 |
| 2. అస్సాం | 27,197 | 18,961 | 6.754 | 5.8 |
| 3. బీహార్ | 16,715 | 11,479 | 3,330 | 4.8 |
| 4. గుజరాత్ | 63,961 | 43,304 | 28,722 | 4.4 |
| 5. హర్యానా | 78,781 | 51,166 | 36,592 | 4.8 |
| 6. కర్ణాటక | 52,097 | 57,092 | 41,407 | 3.8 |
| 7. కేరళ | 59,179 | 51,081 | 36,787 | 1.3 |
| 8. మధ్యప్రదేశ్ | 27,250 | 19,226 | 11,474 | 6.2 |
| 9. మహారాష్ట్ర | 74,027 | 1,30,964 | 1,06,488 | 2.8 |
| 10 ఒడిశా | 33,226 | 24,608 | 12,613 | 6.1 |
| 11. పంజాబ్ | 60,746 | 55,492 | 42,920 | 3.4 |
| 12. రాజస్థాన్ | 34,042 | 18,696 | 16,828 | 5.5 |
| 13. తమిళనాడు | 63,547 | 47,653 | 54,357 | 2.4 |
| 14. యూపీ | 23,395 | 18,721 | 8,162 | 6.1 |
| 15. పశ్చిమబెంగాల్ | 41,219 | 34,303 | 21,849 | 3.1 |
| సగటు | 46,492 | 44,840 | 33,688 | 4.7 |

★ తలసరి ఆదాయం తలసరి బ్యాంకు డిపాజిట్లు, తలసరి బ్యాంకు రుణాలు.. రూపాయల్లో

# ప్రచారం చేపట్టిన లోక్‌సత్తా పార్టీ

## రాయదుర్గం



లోక్‌సత్తా పార్టీ రాయదుర్గం పట్టణంలో ఇంటింటి ప్రచారం చేపట్టింది. పట్టణంలోని గ్యాస్ గోడౌన్, ముత్తరాసి కాలనీలో రాయదుర్గం అభ్యర్థి బి. వెంకటరమణ బాబు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి లోక్‌సత్తా పార్టీ 'ఈల' గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అవినీతిని అంతమొందించడానికి లోక్‌సత్తా పార్టీని గెలిపించాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్, టీడీపీ వైఎస్‌కాంగ్రెస్ పార్టీలు డబ్బు పంచి ఓటర్లను మభ్యపెట్టవచ్చుని కావున ఆ పార్టీలకు బుద్ధిచెప్పడానికి లోక్‌సత్తా పార్టీని గెలిపించాలని కోరారు. రాయదుర్గం నియోజకవర్గంలో ప్రజా సమస్యలను ప్రభుత్వం విస్మరించింది. రాయదుర్గం వాసులు అనేక సమస్యలతో సతమతమవుతున్నా, మురికి నీరు వర్షం వచ్చినప్పుడు రోడ్ల పైకొచ్చి నివాసముంటున్న గృహాలలోకి ప్రవేశించినా ప్రత్యామ్నాయ చర్యలు కూడా చేపట్టడం కరువైందన్నారు. ఆస్తి ఇంటి పన్నులు పెంచి మరింత భారంగా మారింది. పన్నుకు తగ్గ ప్రజలకు ఫలితం అందక నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా సమస్యలు విస్మరించిన సంప్రదాయ పార్టీలకు బుద్ధిచెప్పాలని ప్రజలను కోరారు. అవినీతి లేని పాలన కోసం లోక్‌సత్తాకు మద్దతు పలికి మీరు వేసే ప్రతి ఓటు అవినీతిని తరిమికొట్టడానికి, పట్టణంలో 31 వార్డులోని ప్రతి ఇంటింటికిపోయి లోక్‌సత్తా పార్టీ గురించి తెలియపరిచారు. ప్రతి ఒక్కరూ గెలుపుకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**ప్రజా సమస్యల పరిష్కారంలో అధికార, ప్రతిపక్షాలు విఫలం**

**కణేకల్లు :** ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీ టిడిపి పూర్తిగా విఫలమయ్యాయని



రాయదుర్గం నియోజకవర్గం లోక్‌సత్తా పార్టీ అభ్యర్థి బాబు విమర్శించారు. మండల పరిధిలోని ఎర్రగుంట, కణేకల్లులో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, టిడిపి నేతలు ఒకరిపై ఒకరు దూషించుకోవడంలో ఉన్న శ్రద్ధ, ప్రజల సమస్యలు పరిష్కరించడంలో చూపించడం లేదన్నారు. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య నెలకొన్నా అధికారులకు, ప్రజాప్రతినిధులకు చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యలు పట్టించుకోకపోయినప్పటికీ వాటిని అమలు పరచాలని టిడిపి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలం చెందిందని, తద్వారా అభివృద్ధి పనులు అటకెక్కాయని పేర్కొన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ అందిస్తున్న ప్రభుత్వం రైతులకు శాశ్వత పరిష్కారాలు చూపించి ఆదుకోవాలన్నారు. అలాగే రోడ్ల విషయంలో కాంగ్రెస్, టిడిపి నేతలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రం మొత్తం మీదుగా 2శాతం మాత్రమే లోక్‌సత్తా నేతలు ఉన్నారని, వీరు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో 20శాతం ముందున్నారన్నారు. లోక్‌సత్తా పార్టీ కొత్తతరానికి కొత్తరాజకీయం అనే సిద్ధాంతంపై ముందుకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు తిప్పేస్వామి, నాగరాజు, అబ్దుల్లా, లోకేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

**వ్యవసాయ పంటలపై ఆంక్షలను తొలగించాలి**

**గమ్మగట్ట :** వ్యవసాయంపై నున్న ఆంక్షల్ని తొలగించి రైతులు



పండించే పంటలకు గిట్టుబాటు ధరల్ని కల్పించి శాశ్వత ప్రాతిపదికను చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గం అభ్యర్థి బి.బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పూలకుంట గ్రామంలో అభ్యర్థి బి.బాబు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరుగనున్న ఉప ఎన్నికలలో అవినీతి అంతానికి లోక్‌సత్తా పార్టీకి తమ అమూల్యమైన ఓటు వేసి పార్టీని బలపరచాలని ఆయన కోరారు. లోక్‌సత్తాపార్టీ ప్రధానంగా మూడు అంశాల మీద ప్రచారాన్ని కేంద్రీకరిస్తున్నట్లు ఆయన అన్నారు. ప్రభుత్వమే మద్యం వ్యాపారాన్ని చేపట్టి పరిమిత స్థాయిలో, నిర్ణీత వేళల్లోనే షాపులు నిర్వహించాలని, బెల్టుషాపుల నియంత్రణాధికారాలను పంచాయతీలకే అప్పజెప్పాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. లోక్‌సత్తా పార్టీ రూపొందించిన బిల్లును పరిగణనలోకి తీసుకొని బలమైన స్వతంత్ర ప్రతిపత్తిగల లోకాయుక్తను ఏర్పాటుచేసి అవినీతి అంతానికి వ్యవస్థీకృత వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిప్పేస్వామి, నాగరాజు, లోకేష్, అబ్దుల్లా, రాజు, మధురిమలు పాల్గొన్నారు.

# సామాజిక వికాసం లోక్‌సత్తా లక్ష్యం



**తణుకు**

లోక్‌సత్తా పార్టీ ఆశయాలకనుగుణంగా సుపరిపాలనతో కూడిన రాజకీయాన్ని సాధించే లక్ష్యంతో పాటు యువత సామాజిక వికాసానికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందని పట్టణ పార్టీ అధ్యక్షులు డాక్టర్ వంక వెంకటరామదాస్ అన్నారు. లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో వేసవి ఉచిత శిక్షణా తరగతులను ప్రారంభించారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అధ్యక్షురాలు డాక్టర్ వల్లూరి సుబ్బలక్ష్మి మాట్లాడుతూ లోక్‌సత్తా పార్టీ ప్రస్తుత రాజకీయాల్లో విభిన్నమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తోందని, పట్టణ, గ్రామీణస్థాయి ప్రజలు పార్టీని అభిమానించాలన్నారు. పట్టణ కన్వీనర్ ఎంఎస్‌కె.చైతన్య వేసవి దృష్ట్యా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్. సంగీతం, శారీ పెయింటింగ్, సంస్కృత శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఉత్సాహవంతులు మరింతగా తరగతులకు హాజరు కావాలని కోరారు. పార్టీ సెక్రటరీ డి. కస్తూరి మాట్లాడుతూ లోక్‌సత్తా పార్టీ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాభిమానాన్ని తప్పక చూరగొంటుం దన్నారు. ఉచిత శిక్షణా తరగతుల కన్వీనర్ కామర్సు లక్ష్మీకిరణ్మయి మాట్లాడుతూ మే నెలాఖరు వరకూ కొనసాగించనున్న ఈ శిక్షణా తరగతులకు యువతీ, యువకుల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. పార్టీ ఉపాధ్యక్షులు మద్దిపాటి రాజశేఖర్ పార్టీ చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. ఇరగవరం మండల అధ్యక్షులు కృష్ణ ఆదిత్య, బెల్లంకొండ శ్రీనివాస్, అమీర్ హంజా, కార్యకర్తలు సిహెచ్.నాగమల్లిక, దేవి, బిహెచ్.నరసింహారావు, సాయిరాజ్, వై.జె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్‌కు సంబంధించి డి.కస్తూరి, సంస్కృత శిక్షణను వై.రాజ్యలక్ష్మిత శిక్షణా తరగతులు ప్రారంభించారు. తొలుత జ్యోతిప్రజ్వలనతో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# చిలకలూరిపేట

## చెరువులకు సాగర్ జలాలు విడుదల చేయాలి లోక్‌సత్తా డిమాండ్

పట్టణ శివారులో రెండు తాగునీటి చెరువులకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సాగర్ జలాలను విడుదల చేయాలని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాదాసు భానుప్రసాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని త్రాగునీటి సమస్యాత్మక ప్రాంతాల్లో స్థానిక నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా శివారు కాలనీ వాసులకు నేతలకు నీటి సమస్యలపై మొరపెట్టుకున్నారు. వారానికొకసారి కూడా త్రాగునీరు సరఫరా కావడం లేదని, ట్యాంకర్లు పంపమని కోరుతుంటే ఇదిగో, అదిగో అంటూ పురపాలకులు మభ్యపెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని, పూడికతీతపనులు చేపట్టకపోవడంతో రాత్రివేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతే దోమలు రక్తాన్ని పీల్చుకుతింటున్నాయని స్థానికులు నేతలకు చెప్పి వాపోయారు. ఈ సందర్భంగా భానుప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు రోడ్లెక్కి, నిరసించి రాస్తారోకోలు చేస్తే తప్ప అధికారులు తమ కర్తవ్యాన్ని గుర్తెరిగేటట్లులేరని, వందలమందిగా వెళ్ళి పురపాలక సంఘాన్ని ముట్టడిస్తే తప్ప అధికారులు స్పందించే పరిస్థితి లేదని స్థానికులకు పిలుపునిచ్చారు. సమస్యల సాధనకై ప్రజలు కలిసికట్టుగా పోరాడాలన్నారు. ఈ సందర్భనా కార్యక్రమంలో మురికిపూడి వెంకట ప్రసాద్, పట్టణనేతలు తదితరులున్నారు.

# నరసరావుపేట

## పన్ను ఎగవేతను అరికట్టాలి - పట్టణ సౌందర్యం కాపాడాలి

నర్సరావుపేట పట్నంలో పలు విద్యా-వ్యాపార - మత సంస్థలు పబ్లిక్ గోడల వికృతీకరణ చట్టాన్ని ఉల్లంఘించి, గోడలపై విచ్చలవిడిగా పోస్టర్లు అంటిస్తున్నారని ప్రకటనల పన్నును చెల్లించకుండా ఎగేస్తున్నారని, ఈ అక్రమాలను అరికట్టి, పట్టణసౌందర్యాన్ని ఇనుమడింపజేయాలని, మంచి సూక్తులు రాయించాలని లోక్‌సత్తా పార్టీ మరియు విద్యార్థిసత్తా డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఏప్రిల్ 18న మున్సిపల్ పార్టీ అధ్యక్షులు



ఈదర గోపిచంద్, విద్యార్థిసత్తా నేతలు కె. రమణారెడ్డి, సద్దాం,హుస్సేన్, సాయిచైతన్య, చరణ్‌కుమార్, నగేష్ తదితరులు కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది చేపట్టిన అక్రమ (అనుమతి లేని) పోస్టర్ల తొలగింపు కార్యక్రమంలో పాల్గొని శ్రమదానం చేశారు.

# విజయనగరం

## కాంగ్రెస్, దేశంకు ధీటుగా యువసత్తా ఫ్లెక్సీల ప్రచారం

మద్యం సిండికేట్లకు వ్యతిరేకంగా గత వారం రోజులుగా విజయనగరంలో జరుగుతున్న పెక్సీలపోరులో కొత్తగా వినూత్నంగా లోక్‌సత్తా పార్టీ యువసత్తా జిల్లా ప్రతినిధులు, పాండ్రకి వెంకటరమణ, కె.దయానంద్‌లు ప్రారంభించారు. ఏప్రిల్23న జరగనున్న మహాధర్నా, ఎందుకోసం, ఎవరి సమస్యలు పరిష్కారం కోసమో దేశం, కాంగ్రెస్ పార్టీల ప్రతినిధులు ప్రజలకు చెప్పాలని, రెండు రాజకీయ పార్టీల నాయకుల అన్నదమ్ముల్లో వ్యాపారాలు చేసి కోట్లు గడించి ఇప్పుడు దొంగనువ్వంటె నువ్వు అనే రీతిలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని యువసత్తా ఆరోపిస్తూ ప్రధాన కూడలిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసారు. మద్యం సిండికేట్లలో ఎంఆర్‌పి కి మించి మద్యం అమ్మకాలు జరిగినపుడు ఎందుకు ఈ రాజకీయ నాయకులు మాట్లాడలేదని నిత్యవసర ధరలు పెరిగినప్పుడు, విద్యుత్ ఛార్జీలు పెరిగినపుడు ఆస్తి పన్నులు పెరిగినపుడూ మాట్లాడని రాజకీయ పార్టీ నాయకులు ఇప్పుడు ఆస్తి మే సవాల్ అని మహా ధర్నాలు చేయడం విచిత్రంగా ఉందని యువసత్తా ప్రజలకు రాసిన బహిరంగ లేఖలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో యువసత్తా సభ్యులు పవన్, తేజోకళ్యాణ్, బాస్కర్, మాధవ్, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.




కెపిహెచ్‌బి ప్రజాపథం లో......




కూకట్‌పల్లి ప్రజాపథం లో......



ఓల్డ్ బోయిన్‌పల్లి ప్రజాపథం...



ఒంగోలులో పొగాకు రైతులతో డా॥ జేపీ





పీజీ కళాశాల విద్యార్థులతో డా॥ జయప్రకాష్ నారాయణ్

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12








విశాఖపట్నం భూ కుంభకోణంపై రౌండ్‌టేబుల్ సమావేశం లో మాట్లాడుతున్న డా॥ జేపీ

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad